# ధర్మఘంటి

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 168 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | బుధవారం, 17 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


## 26 శాతం క్షీణించిన వాణిజ్య లోటు

దేశ ఎగుమతులు వరుసగా రెండో నెలా పుంజుకున్నాయి. సోమవారం ప్రభుత్వ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఆగష్టులో దేశ ఎగుమతులు 6.7 శాతం పెరిగి 35.1 బిలియన్ డాలర్ల(రూ. 3.09 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. అంతకుముందు జూలై నెలలో ఇవి 37.24 బిలియన్ డాలర్లు(రూ. 3.28 లక్షల కోట్లు) గా ఉన్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## ఇకపై ఉబర్‌లో హెలికాప్టర్ బుకింగ్స్..!

ప్రముఖ దిగ్గజ టాక్సీ సేవలందించే యాప్ ఉబర్ లో కొత్త సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు కారు, బైక్, ఆటో మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉండేది. వీటితో పాటు యాప్‌లో హెలికాప్టర్ బుకింగ్స్ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. గతంలో ఈ సర్వీస్ కేవలం ఇటలీలో మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం అత్యధిక జనాభా కలిగిన నగరాల్లో హెలికాప్టర్ రైడ్ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.

## భక్తుల డబ్బు.. కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు

- ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేం
- రాష్ట్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- "కల్యాణ మండపాల ఏర్పాటు కోసం భక్తులు తమ డబ్బును ఆలయాలకు ఇవ్వరు
- తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా



## 16వేల మంది విదేశీయులను దేశం నుంచి బహిష్కరించనున్న కేంద్రం..!

- ప్రస్తుతం నిర్బంధ కేంద్రాల్లో ఉన్నవారందరినీ దేశం నుంచి బహిష్కరించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రణాళికలు
- ఫోర్జరీ పత్రాలతో దేశంలో అక్రమంగా నివాసముంటున్న విదేశీయులకు కఠిన శిక్షలు విధించే కొత్త చట్టం సెప్టెంబర్ 2న అమల్లోకి



## తెలంగాణ రైతు సంక్షేమం దేశం మొత్తానికి ఆదర్శం



- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పామాయిల్ సాగులో తెలంగాణ ముందంజ
- రానున్న పార్లమెంట్ సమావేశాల్లో నూతన విత్తన చట్టాన్ని, భారత రైతాంగానికి శ్రేయస్సు చేకూర్చే విధంగా అంగీకరించాలి
- భారతదేశంలోనే ఎక్కువ ఎకరాల్లో పామాయిల్ సాగుచేసే రాష్ట్రంగా తెలంగాణ ముందంజలో ఉంది
- రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, 24 గంటల విద్యుత్ ఏ రాష్ట్రంలో జరుగని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు మన రాష్ట్రంలో జరుగుతున్నాయి



## ట్రాన్స్‌జెండర్‌లకు గౌరవం..

- రేవంత్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం
- మెట్రోలో సెక్యూరిటీ గార్డులుగా 20 మంది ట్రాన్స్‌జెండర్లు
- మెట్రో రైల్ లిమిటెడ్ సెక్యూరిటీ గార్డులుగా నియమిస్తూ నియామక పత్రాలు

హైదరాబాద్

హైదరాబాద్ మెట్రోలో 20 మంది ట్రాన్స్‌జెండర్ల ను సెక్యూరిటీ గార్డులుగా నియమించింది తెలంగాణ ప్రభుత్వం ఈ క్రమంలో మెట్రో రైల్ లిమిటెడ్ సెక్యూరిటీ గార్డులుగా నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు మంత్రి - మిగతా3లో

## స్పీకర్ నిర్ణయంపైనే భవిష్యత్తు



- అసెంబ్లీలో జరుగుతున్న డిఫెక్షన్ కేసులు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతను పెంచుతున్నాయి.
- సుప్రీం కోర్టు ఆదేశాలు, స్పీకర్ నోటీసులు, పార్టీల వాదనలు ఈ ఘటనలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి
- కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి, ట్రెజరీ బెంచీల్లో కూర్చున్నారని బీఆర్ఎస్ వాదన.
- బీఆర్ఎస్ ఆధారాలు (వీడియోలు, సమావేశాలు) బలంగా ఉంటే స్పీకర్ డిస్క్వాలిఫికేషన్‌కు ఆమోదం ఇవ్వవచ్చు
- స్పీకర్ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపును తీసుకురావొచ్చు.

హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీలో జరుగుతున్న డిఫెక్షన్ కేసులు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతను పెంచుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులు యాంటీ?డిఫెక్షన్ చట్టాన్ని, రాజ్యాంగ స్థానాన్ని ప్రశ్నించేలా మలుపు తిప్పుతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలు, స్పీకర్ నోటీసులు, పార్టీల వాదనలు ? ఈ ఘటనలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి

## భారత్ నుంచి డీజిల్ దిగుమతులపై ఉక్రెయిన్ ఆంక్షలు

- రష్యా నుంచి ముడి చమురుపై ఆధారపడటంపై ఆందోళనలు
- శక్తి కన్సల్టెన్సీ ం-95 గతంలో ఈ వేసవిలో ఒక ప్రధాన ఉక్రెనియా చమురు శుద్ధి కర్మాగారం మూసివేయడంతో ఇంధన వ్యాపారులు విదేశీ సరఫరాదారులపై ఆధారం

## ఇందిరమ్మ ఇళ్లకు భారీగా నిధులు



- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇప్పటివరకు రూ.1435 కోట్లు విడుదల
- రాష్ట్రవ్యాప్తంగా 2.15 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభం
- వివిధ దశల్లో కొనసాగుతున్న 1.29 లక్షల గృహాల పనులు
- నిర్మాణ దశను బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు
- తాజాగా సోమవారం ఒక్కరోజే 13,841 మందికి రూ.146 కోట్లు జమ
- ఇప్పటికే కొన్నిచోట్ల గృహప్రవేశాలు చేస్తున్న లబ్ధిదారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ. 1,435 కోట్లను విడుదల చేసినట్లు తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ వెల్లడించారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులను పారదర్శకంగా చేపడుతున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద మొత్తం 2.15 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా, వాటిలో 1.29 లక్షల ఇళ్లు ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని ఆయన తెలిపారు. వీటిలో సుమారు 20 వేల ఇళ్లు గోడల - మిగతా3లో




## టారిఫ్‌లతో అమెరికాకు కష్టాలు

- మొన్న రష్యా ఆయిల్.. ఇప్పుడు మొక్కజొన్న..
- వాణిజ్య చర్చల వేళ భారత్‌పై అమెరికా ఒత్తిడి తంత్రం
- అసంపూర్తిగా నిలిచిపోయిన భారత్-అమెరికా వాణిజ్య చర్చలు పునఃప్రారంభానికి ముందు అగ్రరాజ్యం తన ఒత్తిడి తంత్రాన్ని కొనసాగిస్తోంది.

## రేవంత్ రెడ్డి వల్ల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికపై బీఆర్ఎస్ సన్నాహక సమావేశం
- బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తుంది
- గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు
- హైదరాబాద్‌ను తెలంగాణ ఆర్థిక ఇంజిన్‌గా మార్చిన గత పదేళ్ల తమ ప్రభుత్వ పాలనకు భిన్నంగా, కాంగ్రెస్ పార్టీ విధానాలు నగరాన్ని పూర్తిగా కుప్పకూల్చేలా ఉన్నాయి



హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్ రెడ్డి సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికపై బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించింది. కేటీఆర్ అధ్యక్షతన జరిగిన - మిగతా3లో



## సామాన్య కార్యకర్త నుంచి.. అత్యున్నత స్థాయికి

- నరేంద్రమోడీ 75వ పుట్టిన రోజు
- ప్రస్తుతం నరేంద్ర మోడీ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది
- ఒక సామాన్య ప్రచారకర్త నుంచి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆ తర్వాత దేశ ప్రధానమంత్రి వరకు ఆయన ప్రయాణం చాలా స్ఫూర్తిదాయకం.
- ప్రధానమంత్రి మోడీ 1950 సెప్టెంబర్ 17న గుజరాత్‌లోని వాద్‌నగర్ అనే చిన్న పట్టణంలో జన్మించారు

## గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం

- తాజా దాడుల్లో 62 మంది మృతి
- హమాస్, ఇజ్రాయెల్ దాడులు రెండేండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి.
- ఐడీఎఫ్ దాడుల్లో వందలాది మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోతున్నారు.
- పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోంది


# సంపాదకీయం

## విరాట్ స్వరూపుడు విశ్వకర్మ

విశ్వమంగళ మాంగళ్య విశ్వ విద్యా వినోదినేబీ విశ్వ సంసార భీజాయ నమస్తే విశ్వ కర్మణే. విశ్వాయ విశ్వ రూపాయ నమస్తే విశ్వ మూర్తియేబీ విశ్వ మాత పితా రూప విశ్వకర్మ నమోస్తుతే. సకల ప్రాణి కోటిని సృష్టించు జగత్పతి విశ్వకర్మ ఆవిర్భావం ఈ సృష్టికి పూర్వమే స్వయంభువుగా వెలసిన రూపమే విశ్వకర్మ. పరమాత్మ విశ్వకర్మ ఐదు ముఖాలతో, పది చేతులతో స్వయంభువుగా అవతరించిన రూపంగా భావిస్తారు. విశ్వకర్మ విశ్వకర్మ ఋగ్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో, శుక్ల యజుర్వేదంలో సృష్టి కర్తగా పేర్కొనబడినాడు. అథర్వణ వేదంలో ఆహార ప్రదాతగా వర్ణించ బడినాడు. పురుష సూక్తంలో విరాట్ పురుషుడుగా కీర్తించబడినాడు. సహస్ర బాహుగా, సహస్ర చక్షుగా, సహస్ర పాదుడుగా, సహస్ర ముఖుడుగా అన్ని వేదాలలో వర్ణించబడినాడు. సకల వేదముల ప్రకారం విశ్వకర్మయే సృష్టికర్త. వేదములు విశ్వకర్మను సర్వపాప సంహర్తగా పేర్కొనాయి. సర్వ దిక్కులను పరికించు దృష్టి కలిగిన అమితశక్తి కలవాడు కనుకనే ఈయన భగవంతుడు అని ఋగ్వేదము ఈయనను భగవంతునిగా పరిగణించింది. మహా భారతము ఈయనను వేయికళలకు అధినేతగా అభివర్ణించింది. అర్చమూర్తిని విశ్వకర్మ పురాణము పంచ శీర్షుడుగా వర్ణించింది. విరాట్ వి భగవానుడు (పంచ ముఖుడు) ఐదు ముఖములు కలవాడు. సృష్టి తొలినాళ్ళ నుంచి సుప్రసిద్ధులైన శిల్పకారులు ఐదు మంది ఉన్నారు. వారు విశ్వకర్మకు జన్మించారు. విరాట్ విశ్వకర్మ యొక్క పంచ ముఖాల నుండి మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ బ్రహ్మలు ఉద్భవించారు, ఈ పంచ బ్రహ్మల నుండి వారి సంతతి అయిన ఐదుగురు (సనగ, సనాతన, అహభౌసన, ప్రత్నస, సుపర్ణస.) పంచార్షేయ బ్రాహ్మణులు (విశ్వ బ్రాహ్మణులు) ఉద్భవించారు. వీరి ద్వారా చేయు శాస్త్రం, వృత్తులు నిర్ధేశింప బడినవి. వీటితో పాటు పౌరోహిత్యం కూడా వారి వృత్తులలో భాగమే. ఈయనను దేవతల శిల్పి (దేవా శిల్పి) అంటారు. వృత్తి విద్యలు, నిర్మాణ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన విద్యలకు ఈయన అధిపతి. విశ్వకర్మ సకల కళలకు ఆది దేవుడు, అధిపతి. దేవలోకాలను నిర్మించిన భవన శిల్పి, వాస్తు శిల్పి, స్థపతి (ఆర్కిటెక్చర్). దేవతలకు ఆకాశాన విహరించే పుష్పక విమానాలు, ఆయుధాలు, వివిధ రకాల సువర్ణాభరణాలు మరియు పనిముట్లను సృష్టించి ఇచ్చిన రూప శిల్పి, విశ్వకర్మ భగవానుడు సమస్త హస్త కళలన్నింటికి ఆది దేవుడు, విశ్వము యొక్క ప్రధాన రూపశిల్పి. విశ్వకర్మ ప్రపంచానికి దైవ యాంత్రికుడు (ఇంజనీరు). మొత్తం విశ్వం యొక్క దివ్య చిత్ర లేఖకుడు, మరియు అన్ని దేవతల 'రాజ భవనాలు అధికారిక భవన నిర్మాతగా వున్నాడు. విశ్వకర్మ దేవతల ఆయుధాలను రూపకర్త ఉన్నాడు. వెయ్యి హస్తకళ ఆకృతులకు కార్యనిర్వాహణాది కారి. దేవతల యొక్క వడ్రంగి, చేతివృత్తుల అత్యంత ప్రముఖత, అన్ని ఆభరణాలు యొక్క రూపకర్త మరియు ఒక గొప్ప మరియు శాశ్వత కీర్తిని కలిగిన దేవుడు యొక్క అధినేత అని మహా భారతంలో ఆయన గురించి వివరిస్తుంది. నాలుగు యుగాలన్నింటి లోను ఆయన దేవతలకు అనేక పట్టణాలు మరియు రాజ భవనాలు నిర్మించి ఇచ్చిన స్థపతి, వాస్తు మరియు భవన శిల్పి. సత్య యుగంలో ఇంద్రుడు పరిపాలించే ఇంద్ర లోకాన్ని, త్రేతాయుగంలో స్వర్ణ లంకని ద్వాపర యుగంలో ద్వారకా నగరాన్ని, కలియుగంలో హస్తినా పురాన్ని, ఇంద్ర ప్రస్థాన్ని నిర్మించిన అద్భుత శిల్పి, గొప్ప స్థపతి. పుట్టుక, ఆకారం లేకుండా స్వయంభుగా వెలసిన ఈ విశ్వకర్మ భగవానుని ప్రతి యేట ఎంతో ఘనంగా భక్తి శ్రద్ధలతో పండగగా విశ్వకర్మీయులు జరుపు కుంటారు. శ్లోః నభూమి నజలం చైవ నతేజో నచ వాయవ: నచబ్రహ్మ నచవిష్ణు నచ రుద్రస్య తారకః సర్వ శూన్య నిరాలంబో స్వయంభూ విశ్వకర్మణ. (మూల స్తంభ పురాణం)...భూమి, నీరు, అగ్ని, వాయువు,ఆకాశము, మరియు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర - ఇంద్ర -సూర్య - నక్షత్రములు పుట్టక ముందే విశ్వకర్మ తనంతట తాను స్వయంభు రూపమై అవతరించి నాడు. ఐదు ముఖాలతో పంచ తత్వాలతో, పంచ రంగులతో, పంచ కృత్యములతో వెలసిన విశ్వకర్మ దేవుడు విశ్వ బ్రాహ్మణులకు కులగురువైనాడు. శ్లోః పూర్వావనా త్సానగః దక్షణా త్సనాతనఃబీ అపరా దహభూవః ఉద్వీచ్యాం ఉర్ధవాత్సుపర్ణః విశ్వకర్మ పరాత్పరుని యొక్క తూర్పు ముఖమైన సద్యోజాతములో సానగ బ్రహ్మర్షి మను బ్రహ్మయు, దక్షిణ ముఖమైన వసుదేవములో సనాతన మహర్షి యను మయబ్రహ్మయు, పశ్చిమ ముఖమైన అఘోరియునందు అహభూవ మహర్షి యను త్వష్ట బ్రహ్మయు, ఉత్తర ముఖమైన తత్పురుషములో ప్రత్న మహర్షి యను శిల్పి బ్రహ్మయు, ఊర్ధ్వ ముఖమైన ఈశానములో సువర్ణ మహర్షియను విశ్వజ్ఞ బ్రహ్మయు ప్రభవించినట్లు చెప్పబడినది. ఋక్ వేదం లోని పదవ మండలం 81,82 సూక్తాలు విశ్వకర్మ యొక్క సృష్టి నిర్మాణ క్రమాన్ని వివరిస్తాయి. అందరికీ సుపరిచితమైన పురుష సూక్తం కూడా విశ్వకర్మను విరాట్ పురుషునిగా వర్ణించింది. పూర్వం వృత్తి సమాజంలోని ప్రజలకును, ప్రభువులకును తమ విజ్ఞానాన్ని తమదైన శైలిలో ప్రపంచానికి చాటి చెప్పడానికి ఉపయోగపడే కళానైపుణ్యం విశ్వకర్మీయులది. ప్రాచీన విజ్ఞానానికి నిలువుటద్దం ఈ వృత్తులు. అసలు ఈ సమాజం నడవడానికి వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. విశ్వ బ్రాహ్మణులు పంచ వృత్తులతో పాటు పౌరోహిత్యం కూడా చేస్తారు, పూర్వ కాలంలో, రాజ్యానికి శుభములు సమ కూర్చేందుకు, పొరుగు దేశరాజుల దండయాత్రల వంటి విషమ పరిస్థితుల లోను మంత్రి, జ్యోతిష్కులు, పురోహితులతో రాజు సమాలోచనలు జరిపేవాడు. వివాహాది షోడశ కర్మలు, పూజలు, వ్రతాలు మరియు యజ్ఞ యాగాదులు, జరుపడానికి సామన్య ప్రజలు జ్యోతిషుని, పురోహితుని తప్పక ఆశ్రయించేవారు. ఈ విశ్వకర్మల గురించి వేద, పురాణ, ఇతిహాసాలలో, ప్రాచీన సాహిత్యంలో,ఆధునిక సాహిత్యంలో వీరి గురించి ప్రస్తావించ బడినది. ఉదహరణకు ప్రజాకవి వేమన తన శతకంలో అంటాడు "విశ్వకర్మ లేని విశ్వంబు లేదు" అని మరోక చోట "విశ్వకర్మ దేవాది దేవుడు" అని ప్రస్తావించాడు. ఇదే విధముగా విశ్వకర్మ గురించి నన్నయ, తిక్కన, ఎర్రన, గోన బుద్దారెడ్డి, హూళక్కి భాస్కరుడు, కంకంటి పాప రాజు, మారన, పోతన, శ్రీనాధుడు, చేమకూర వేంకటకవి, పుష్పగిరి తిమ్మన, ధూర్జటి, బద్దేన, వేమన, తరిగొండ వెంగమాంబ, మట్ల అనంతరాజు, దొంతిరెడ్డి పట్టాభి, రామదాస కవి మొదలగు వారెందరో వారి వారి రచనలలో ప్రస్తావించారు. విశ్వ బ్రాహ్మణుల వృత్తుల ద్వార సమాజ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. వీరిని ఈ సమాజంలో ఆచార్య, దైవజ్ఞ , ఆచారి అనే పేర్లతో పిలుస్తుంటారు. దేవాలయాలలో విగ్రహాలు తయారు చేయువారు విశ్వకర్మలే. ఇంతటి ప్రత్యేకతలు కలిగిన వీరు పూర్వం యంత్ర పరికరాలు రాక ముందు పనులన్ని మానవ శ్రమ తోనే ముడిపడి ఉండేవి. లోకంలో మానవ జీవనానికి విశ్వకర్మీయుల కులవృత్తులు ప్రధాన ఆధారంగా ఉండేవి, ఉన్నాయి. ఈ విశ్వకర్మ కులంలో జన్మించిన శ్రీమద్వి విరాట్ శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కుల వృత్తులను చేస్తూనే కాల జ్ఞానాన్ని చెప్పాడు. నిష్టాగరిష్టులైన ఈ విశ్వ బ్రాహ్మణులు కుల వృత్తులనే కాక జ్యోతిష, పౌరోహిత, యంత్ర, గృహవాస్తు నిర్మాతలుగా, విద్యా వేత్తలుగా, వైద్యులుగా, ప్రకృతి వైద్యులుగా, శాసన లేఖకులుగా, ఆర్కిటేక్చర్లుగా, సివిల్ ఇంజనీయర్లుగా, అన్ని రంగాలలో, నాటి నుండి నేటి వరకు సకల కళల యందు వీరి ప్రావీణ్యతను నిరూపిస్తూ ఈ విశ్వం నందు నిష్ణాతులై విరాజిల్లుతున్నారు.

# స్వాభిమాన ఆత్మగౌరవ పోరాట యోధుడు "పెరియార్"

ద్రవిడ జాతిపిత, సామాజిక సంఘ సంస్కర్త, స్వాభిమాన ఆత్మగౌరవ పోరాట యోధుడు పెరియార్ ఇ. వి. రామస్వామి నాయకర్. ఆయన 1879 సెప్టెంబర్ 17న తమిళనాడులోని ఈరోడ్ పట్టణంలో సంపన్న వ్యాపార బలిజ కుల కుటుంబంలో వెంకటప్ప నాయకర్, చిన్న జియమ్మల్ దంపతులకు జన్మించాడు. ఈయన 94 సంవత్సరాల 3 నెలల 7 రోజులు జీవించి 1973 డిసెంబర్ 24న తుదిశ్వాస విడిచారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, కుల నిర్మూలన, మానవ విలువల కోసం హిందూ మత ఆచారాలను, కట్టుబాట్ల లోపాలను ఎత్తిచూపి బ్రాహ్మణిజానికి అతను సవాల్ గా నిలిచి, మనువాదుల గుండెల్లో రివాల్వర్ గా మారాడు.



బాల్యం నుండి మూఢ నమ్మకాల పట్ల వ్యతిరేకత, దేవుడు, మతం పట్ల అయిష్టతతో ప్రతిదానిని సూక్ష్మంగా ఆలోచించే స్వభావాన్ని ఏర్పరుచుకున్నాడు. పెద్దగా చదువుకోనప్పటికీ అప్పటి కుల, మత, సామాజిక, రాజకీయ అంశాలలో తగిన పరిజ్ఞానం వుండేది. యవ్వన దశ రాగానే 19వ యేట నాగమ్మాయి'తో వివాహమైంది. దురదృష్ట వశాత్తుతో ఆయనకు పుట్టిన పాప 5 నెలలకే మరణించింది. ఆ తరువాత వీరికి సంతానం కలగలేదు. కుటుంబ జీవనంలో విసుగు చెంది, కాశీయాత్రకు వెళ్ళిన వెళ్లిన సమయంలో పెరియార్ కు అక్కడ బ్రాహ్మణ సత్రంలో అవమానం జరిగింది. బ్రాహ్మణిజానికి పునాది హిందూ మతం యొక్క భయంకరమైన కుల వివక్ష అతన్ని ఆలోచింపచేసి కుల నిర్మూలన, కుల వివక్షకు వ్యతిరేక ఉద్యమాలు చేసేటట్లు ప్రేరేపించింది. ఆ సంఘటన, భారత దేశంలో స్వాతంత్ర్యోద్యమం నడుస్తున్న కాలమది. ఈరోడ్ మున్సిపల్ చైర్మన్ పదవితోపాటు, మరో 28 గౌరవాధ్యక్ష పదవులకు రాజీనామా చేసి, 1919 నుండి 1925 వరకు కాంగ్రెస్ పార్టీలో పెరియార్ నాయకర్ చేరి మొదటగా గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై, కాలక్రమేణా గాంధీ - కాంగ్రెస్ పార్టీ బ్రాహ్మణవాద విధానాలు, ఆ పార్టీ బడుగు, బలహీన వర్గాల వారికి, దళిత, గిరిజన, ఆదివాసీ, మైనారిటీ ప్రజలకు చేసిందేమీ లేదని 1925వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చాడు. పెరియార్ నాయకర్ కాంగ్రెస్ నుండి బయటకు రావడానికి కెరళా వైకోం ఉద్యమ సమయంలో అతని మీద కేసులు పెట్టి జైళ్ల పాలు చేయడం మరియు శూద్రులకు, ఉత్పత్తి కులాల ప్రజలకు విద్య ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు కావాలని పెరియార్ 1920-25 వరకు జరిగిన కాంగ్రెస్ సభలల్లో తీర్మానాలు పెడితే ఆ పార్టీ బ్రాహ్మణ వాదులు ఆ తీర్మాణాన్ని నెగ్గనిచ్చేవారు కాదు. కనుకనే పెరియార్ ఆత్మగౌరవంతో బయటకు వచ్చి, వివిధ పోరాట కార్యక్రమాల్ని నిర్వహించాడు. 1929 సంవత్సరంలో ఆత్మగౌరవ స్వాభిమాన ఉద్యమానికి పిలుపునిచ్చి కుల చైతన్యం. అంటరానితనం నేరంగా పరిగణించబడడం వంటి విషయాలలో ప్రజలను ఆలోచింప చేశాడు పెరియార్. మధ్యపాన నిషేధం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించాడు. తన సొంత పొలములో వున్న తాటి, ఈత, కొబ్బరి చెట్లను కూడా నరికించడమంటే ఉద్యమంలో అన్నింటినీ నాదీ, నీదీ అనే తేడా లేకుండా ఉండడం అందరికీ సాధ్యపడదు. పెరియార్ లాంటి నిఖచ్చితమైన స్వభావం కలిగిన వారికే సాధ్యమవుతుంది.

పెరియార్ విదేశీ పర్యటనలు కూడా చేశాడు. దాదాపు 11 నెలలు పర్యటించాడు. ఈజిప్ట, గ్రీసు, టర్కీ, రష్యా, జర్మనీ, ఇంగ్లాండ్, స్పెయిన్, ఫ్రాన్స్, పోర్చుగల్ వంటి దేశాలలో జీవన విధానాలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను తెలుసుకోగలిగాడు. విదేశీ పర్యటనలు విలాసంగా కాకుండా ఒక సామాజిక అధ్యయన యాత్రగా చేశాడు. తాను పర్యటించిన దేశాలలో ఉన్న పరిస్థితులు భారతదేశంలో వున్న మత ఛాందస వాద పరిస్థితులు ఏ విధంగా వున్నాయో ఒక అవగాహనకు రాగలిగాడు. పెరియార్ తాను దినదినం మారుతున్న కాలానికి అనుగుణంగా వెళ్ళ సాగాడు. 1933లో ఆత్మగౌరవ కమ్యూనిస్టు పార్టీని ప్రారంభించి 'పురచ్చి' విప్లవ పత్రికను నడిపాడు. కొన్ని రోజులు తన ఉపన్యాసాలలో కమ్యూనిజం ప్రభావం కనపడేది. అనంతరం కమ్యూనిస్టు పార్టీ నుండి బయటకు వచ్చి "జస్టిస్ పార్టీని ఏర్పాటు చేసి, శూద్రులకు, అతిశూద్రుల హక్కుల కోసం ఉద్యమించాడు. 1937లో "విదుతులై" అనే దినపత్రికను నడిపాడు. తన జీవితమంతా కూడా అనగారిణ వర్గాల కోసం, నిమ్న జాతి ప్రజల కోసం, సమానత్వ నైతిక విలువల కోసం పోరాడిన బహుజన నాయకుడు పెరియార్, స్త్రీల హక్కులను గుర్తించి, స్త్రీ చైతన్యాన్ని, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. 1940-42 లలో గవర్నర్ జనరల్ మద్రాస్ గవర్నర్లు దక్షిణ భారత దేశానికి ప్రధాన మంత్రి (ముఖ్యమంత్రి) పదవికి ఆహ్వానిస్తే దానిని తిరస్కరించారు. ఆయన, అంటే పదవుల మీద తనకు వ్యామోహం లేదని చాటి చెప్పాడు.

1944 సంవత్సరంలో జస్టిస్ పార్టీ పేరును డి.ఎం.కె.గా మార్చాడు. నలుపును నిరసనకు చిహ్నంగా చూపాలని పెరియార్ చెప్పాడు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం కాదనీ, అది విషాధ సంతాప దినంగా ప్రకటించాడు. ఎందుకంటే తెల్లదొరలు పోయి నల్లదొరలు (మనువాదం) ఈ దేశాన్ని ఏలుతుదందనీ, ఇది మాకు నిజమైన స్వాతంత్ర్యం కాదని ప్రకటించాడు. 1951లో రిజర్వేషన్ల మద్దతుగా ఉద్యమాన్ని చేపట్టి తొలి రాజ్యాంగ సవరణ చేయించాడు. 1953లో రిజర్వేషన్లను రద్దు చేసినందుకు వినాయక విగ్రహాలు పగులగొట్టే కార్యక్రమాలకు పిలుపునివ్వడం వంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు ఆయనేసాటి అని చెప్పవచ్చు. భారత రత్న, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహ్మద్ ఆలీ జిన్నాలతో కొన్ని సందర్భాలలో కలుసుకుని సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధమైన విషయాలను చర్చించేవారు, కుల నిర్మూలన అంటరాని తనం అనే అంశాలపై జరిగే సభలలో కలుసుకునేవారు. డా? అంబేద్కర్ -పెరియార్. 1954లో "బుద్దుడి" జన్మదినోత్సవాలకై బర్మా వెళ్ళాడు. భారత దేశంలోని నిచ్చన మెట్ల కుల వ్యవస్థకు అసమానత్వానికి, మనుషుల మధ్య హెచ్చుతగ్గులకు, నైతిక విలువల పతనానికి కారణం హిందూ మతమని, మతాన్ని నిర్మూలించాలని పెరియార్ నాయకర్ అన్నారు. హిందూ మత విధానాలన్ని కూడా కల్పితాలతోటి, అవాస్తవంగా, అశాస్త్రీయంగా వున్నాయని మండిపడ్డాడు పెరియార్. సమానత్వాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరు అగ్గిబరాటై పోరు చేయాలని పిలుపునిచ్చాడు. డా? బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన "కుల నిర్మూలన" పుస్తకాన్ని తమిళంలోనికి అనువదించి ప్రతి ఒక్కరితో చదివించేలా చర్యలు తీసుకున్నారు. దక్షిణాది రాష్ట్రాలపై హిందీ బాషను బలవంతంగా రుద్దటాన్ని నిరసిస్తూ జాతీయ జెండాను తగులబెట్టైన పెరియర్ తాను నమ్మిన సిద్ధాంతాలను ఖచ్చితంగా ఆచరణలో పెట్టేవారు.



(నేడు పెరియార్ 146వ జయంతి సందర్భంగా)

**జంగిలి దర్శన్**

పిహెచ్డీ రీసెర్చ్ స్కాలర్,
డి.బి.ఎస్.ఏ స్టేట్ కోఆర్డినేటర్

అణగారిన వర్గాలవారికి, అంటరాని వారికి, అస్పృశ్యులకు దేవాలయ ప్రవేశాల ఉద్యమాన్ని చేపట్టాడు. 1940 సం?రం రైల్వే క్యాంటీన్లపై, "బ్రాహ్మణ పలహారశాల" అనే బోర్డుల్లో బ్రాహ్మణ పదాన్ని తొలగించే కార్యక్రమం చేపట్టి, తమిళనాడు రాష్ట్రమంతా ఈ ఉద్యమాన్ని వ్యాపింపచేశాడు. బ్రాహ్మణ, రెడ్డి, వైశ్య, కమ్మ, కాపు భోజనశాల అని రాయడాన్ని పెరియార్ తీవ్రంగా వ్యతిరేకించాడు. బ్రాహ్మణాధిక్యత కుల వ్యవస్థ, పురుషాధిక్యత, హిందూమత ఆచారాలు, కట్టుబాట్లు వంటి వాటికి వ్యతిరేకంగా జీవితాంతం ఉద్యమించిన పోరాట యోధాను యోధుడు పెరియార్. కుల నిర్మూలన జరగాలనీ, ప్రతి మనిషి సమాజంలో గౌరవంగా బ్రతకాలనేది పెరియార్ ఆకాంక్ష.

1959 సంవత్సరంలో మానవున్ని అంధకార మత విశ్వాసాలు అధోగతి పాలు చేస్తున్నాయని పెరియార్ ఆగ్రహించి, రామాయణం మూఢనమ్మాలు అనే నినాదంతో ఉత్తరాది నగరాలలో సభలు నిర్వహించేవారు. కుల వివక్ష లేని సమాజం కోసం మతాధిపత్యం లేని నూతన వ్యవస్థను నిర్మించాలని, పెరియార్ కలలుగన్నాడు. అందుకే తన జీవితంలో ప్రతీక్షణం అణచివేతకు గురయ్యే కులాలకోసం పోరాడాడు. తన జీవితంలో 11వేల సభల్లో మాట్లాడిన పెరియార్, 9 లక్షల కిలోమీటర్ల ప్రయాణం, 2.15 లక్షల గంటలు వివిధ సభలలో ఉపన్యసించాడు. కనుక అతని ప్రతిమాట, ప్రతి అడుగు మనకు ఆదర్శనీయం, అనుసరణీయం.

1970 జూన్ 7న ఐక్యరాజ్యసమితి విభాగమైన యునెస్కో పెరియార్ కు అవార్డును ప్రకటించింది. ఆ సందర్భంగా పెరియార్ ను సత్కరిస్తూ ఇలా రాశారు: 'నూతన యుగ ప్రవక్త, ఆగ్నేయాసియా దేశాల సోక్రటీస్, సంఘ సంస్కరణోద్యమ పితామహులు, అజ్ఞానానికి, మూఢ నమ్మకాలకు, అర్థంలేని సాంప్రదాయాలకు బద్ద శత్రువు.

1973 డిసెంబర్ 19న మద్రాస్ థింకర్స్ అసోసియేషన్ వారి సభలలో పెరియార్ యొక్క చివరి ప్రసంగం. 1973 డిసెంబర్ 24న వెల్లూర్ ఆస్పత్రిలో కన్నుమూసారు. సెప్టెంబర్ 17న దళిత బహుజనులకు ప్రత్యేక దినం. ఎందుకంటే పెరియార్ జన్మించిన దినం. అందుకే కోట్లాది మంది దళిత బహుజనులు పెరియార్ మీరు మనువాదుల గుండెల్లో రివాల్వర్, పెరియార్ మీకు బహుజనులందరి జోహార్లు అని తలుచుకుంటారు.

పెరియార్ ఆశయాలను మరింత బలంగా సమాజంలో విశ్వవ్యాప్తం చేసేందుకు భావితరాలకు పెరియార్ స్ఫూర్తిని నింపేందుకు ప్రొఫెసర్లు, మేధావులు, కవులు, రచయితలు, వాగ్గేయకారులు, సామాజిక ఉద్యమకారులు,బహుజన విద్యార్థి నాయకుల సమక్షంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా ఒక మేదోమథనం జరపాలని భావించి, దళిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్ డి.బి.ఎస్ ఏ విద్యార్థి సంఘం పెరియార్ 146వ జయంతి మహోత్సవాన్ని జరుపాలని, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్ లో 17 సెప్టెంబర్ 2025 రోజున నిర్వహించడానికి సిద్ధమయ్యారు.

పెరియార్ ఆశయాలను, సిద్ధాంతాలను ఆయన కోరుకున్న నవయుగ సమాజం కోసం, ఆయన బాటలో నడవడమే ఆయనకిచ్చే అసలు సిసలైన గౌరవం.

# పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" అనుసరణీయమే

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్ధనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయు లందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) చదువుతారు. అయితే ఆ ప్రతిజ్ఞ రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీ యమే. వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం. తెలంగాణ లోని నల్గొండ సమీపం లోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు. వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 - 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతుల కు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్టం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945-46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు. చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు 1962 సెప్టెంబర్ 17న రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్థనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు. 1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లీష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు. 1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువు తున్నారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015-16 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి

# టారిఫ్‌లతో అమెరికాకు కష్టాలు

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య సంబంధాలు గత కొన్ని నెలలుగా ఒక ఆసక్తికరమైన మలుపు తిరిగాయి. టారిఫ్‌ల బెదిరింపులు, వాణిజ్య చర్చలు, ఇండో-పసిఫిక్ భద్రతా విషయాలు మధ్య, ఈ రెండు దేశాల మధ్య సహకారం ఒక్కసారిగా ఒత్తిడికి గురైనప్పుడు, మరోవైపు క్వాడ్ వంటి వేదికల్లో పునరుద్ధరణ చెందుతున్నట్లు కనిపిస్తోంది. ట్రంప్ వాణిజ్య విధానాలు భారత్‌పై గట్టిగా పడిపోయాయి. రష్యన్ ఆయిల్ దిగుమతులను ఆపమని డిమాండ్ చేస్తూ, ఆగస్టు 2025లో భారత్ నుంచి అమెరికాకు వచ్చే చాలా దిగుమతులపై 50% టారిఫ్‌లు విధించారు. ఇది భారత వ్యాపారానికి బిలియన్ల డాలర్ల నష్టాన్ని కలిగించే అవకాశం ఉంది. ఆర్థిక విశ్లేషకుల ప్రకారం భారత జీడీపీ 0.81% తగ్గుతుందని అంచనా. కానీ, ఈ టారిఫ్‌లు అమెరికాకు కూడా వెనుకబాటు పడిపోయాయి. భారత్ నుంచి వచ్చే చౌక దిగుమతులు (ఉదా., టెక్నాలజీ, ఔషధాలు) అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవి. ఈ డ్యూటీలు అమెరికన్ వినియోగదారులు, చిన్న వ్యాపారాలకు ధరలు పెంచుతాయి. ట్రంప్ స్వయంగా గుర్తించినట్లు, భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం తప్పనిసరి, ఎందుకంటే టారిఫ్‌లు దీర్ఘకాలంలో అమెరికాకు లాభం కాకుండా, చైనా, ఇతర దేశాలకు అవకాశాలు కల్పిస్తాయి. ఇటీవలి చర్చల్లో, రెండు దేశాలు 'అసలు దూరం లేదు' అని అమెరికా అధికారులు చెప్పారు. ట్రంప్ మోదీతో ఫోన్ కాల్ చేసి, వాణిజ్య అడ్డంకులను తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ట్రంప్ మొదటి విధానం ఓటమి కావడానికి ఒక సూచన.మోదీ స్పందన పట్టుదలతో కూడినది. బ్రిక్స్ సదస్సులో(ఆన్‌లైన్ మీటింగ్‌లో) మోదీ హాజరు కాకపోవడం ట్రంప్‌కు ఒక సిగ్నల్‌గా పనిచేసింది, ఎందుకంటే ట్రంప్ బ్రిక్స్‌పై కోపంగా ఉన్నారు. ఇది భారత్‌ను రష్యా, చైనాతో మరింత దగ్గరపడకుండా చూపించింది, అదే సమయంలో అమెరికాతో సంబంధాలను కాపాడుతూ. మోదీ ట్రంప్‌ను బెదిరింపులకు బదులు, బహుళ దేశాలతో (చైనా, రష్యా, బ్రెజిల్) మాట్లాడి, టారిఫ్‌లకు ప్రతిస్పందనగా వైవిధ్యమైన వాణిజ్య మార్గాలు వెతికారు. ఈ వ్యూహం పనిచేసింది. ట్రంప్ మొదట భారత్‌ను 'టారిఫ్ కింగ్'గా విమర్శించారు, కానీ ఇప్పుడు మోదీని 'మంచి స్నేహితుడు'గా పిలుస్తున్నారు. భారత్ రష్యన్ ఆయిల్ దిగుమతులను కొంచెం తగ్గించినప్పటికీ, పూర్తిగా ఆపలేదు. ఇక మోదీ చాణక్య నీతి ? ఒత్తిడిని ఉపయోగించుకుని స్వేచ్ఛను కాపాడటం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. ఫలితంగా, ట్రంప్ భారత్‌ను కోల్పోవద్దని గుర్తించారు, ఎందుకంటే భారత్ లేకుండా ఇండో?పసిఫిక్ వ్యూహం బలహీనమవుతుంది.క్వాడ్ (భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా) ఇండో?పసిఫిక్ భద్రతకు కీలకం. 2025 చివరిలో భారత్‌లో జరిగే సమావేశానికి మొదట ట్రంప్ రాకపోవచ్చని అంచనా వచ్చింది, టారిఫ్ టెన్షన్ల కారణంగా. కానీ, ఇటీవలి అభివృద్ధి ఆశావాదాన్ని ఇస్తోంది. అమెరికా అధికారులు ట్రంప్ వస్తారని నిర్ధారించారు, మోదీతో ఫోన్ కాల్ జరిగే అవకాశం ఉంది. ఇక్కడ ముఖ్యమైనది సెనేట్ కన్ఫర్మేషన్ హియరింగ్‌లో అమెరికా రాయబారి అభ్యర్థి



సెర్జియో గోర్ వ్యాఖ్యలు. ఆయన చెప్పినట్లు, 'క్వాడ్ చాలా ముఖ్యం, ట్రంప్ దీనికి పూర్తి కమిట్‌మెంట్ చూపిస్తారు.' ఇది ట్రంప్ స్వర మార్పును సూచిస్తుంది. మొదట భారత్‌ను ఉపేక్షించాలని భావించారు, కానీ ఇప్పుడు చైనాను అదుపు చేయడానికి భారత్ అవసరమని గుర్తించారు. వియత్నాం లేదా కొరియా వంటి దేశాలు చైనా ఆధిపత్యాన్ని సవాలు చేయలేవు, కానీ భారత్ ఉన్న క్వాడ్ బలమైనది. టారిఫ్‌లు భారత్‌ను బెదరపరచలేదు, కానీ అమెరికా భారత్‌ను కోల్పోతే చైనాకు లాభం.మొత్తంగా, ఈ సంఘటనలు అమెరికా?భారత సంబంధాల్లో మార్పును చూపిస్తాయి. ట్రంప్ మొదట బెదిరింపులతో ముందుకు వెళ్లారు, కానీ భారత్ దౌత్యం ? మోదీ యొక్క పట్టుదల మరియు వ్యూహం ? దాన్ని తిప్పికొట్టింది. టారిఫ్‌లు భారత్‌కు నష్టం కలిగించినప్పటికీ, అవి అమెరికాకు ఎక్కువ హాని చేశాయి. క్వాడ్ వంటి వేదికలు భారత్ స్థానాన్ని బలోపేతం చేశాయి.

### వాణిజ్య చర్చల వేళ భారత్‌పై అమెరికా ఒత్తిడి తంత్రం

ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలు బాంబులు విసిరిన అగ్రరాజ్యం... ఆ తర్వాత వాణిజ్య భాగస్వామ్య దేశాలతో చర్చలు జరిపి.. ఒప్పందాలు చేసుకునేలా ముందుకెళ్తోంది. కానీ, భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు, రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు చేసుకుంటోందన్న సాకుతో మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. అయితే, ఆరో విడత చర్చలు ప్రారంభం వేళ అమెరికా మరో ఒత్తిడి తంత్రానికి తెరతీసింది. అసంపూర్తిగా నిలిచిపోయిన భారత్-అమెరికా వాణిజ్య చర్చలు పునఃప్రారంభానికి ముందు అగ్రరాజ్యం తన ఒత్తిడి తంత్రాన్ని కొనసాగిస్తోంది. అమెరికాలో పండిన గుప్పెడు మొక్కజొన్నను కూడా భారత్ కొనుగోలుచేయడం లేదని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ విమర్శించారు. తమ మొక్కజొన్నను కొనుగోలు చేయకపోతే భారత్ తమ మార్కెట్ యాక్సెస్ కోల్పోతుందని ఆక్సియోస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో లుట్నిక్ హెచ్చరించారు. అంతేకాదు, భారత్ సుంకాలను తగ్గించకపోతే 'కష్టకాలం' ఎదురవుతుందని బెదిరింపులకు దిగారు. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం భారత్‌పై ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.భారత్-అమెరికా సంబంధాలు వన్-వేలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'మాకు వస్తువులు అమ్మి వాళ్లు ప్రయోజనం పొందుతున్నారు.. మా ఆర్థిక వ్యవస్థను వాళ్లు (భారత్) స్తంభింపజేస్తున్నారు.. వారు మా మార్కెట్‌లోకి ప్రవేశించి, విస్తృతంగా ప్రయోజనం పొందడానికి మేము ద్వారాలు తెరిచినప్పుడు వారు మాకు అమ్ముతారు' అని పేర్కొన్నారు.'140 కోట్ల మంది ప్రజలు ఉన్నారని చెప్పుకునే భారత్.. అమెరికాలో పండిన గంపెడు మొక్కజొన్న గింజలను ఎందుకు కొనడం లేదు? వాళ్లు మనకు అన్నీ అమ్మేస్తారు, మన మొక్కజొన్న కొనరని మనం అనుకోవడం తప్పా? వాళ్లు ప్రతిదానిపైనా సుంకాలు విధిస్తారు' అని విమర్శించారు. 'సుంకాలను తగ్గించాలని . మీ సుంకాలను తగ్గించండి, మేము మీతో ఎలా ప్రవర్తిస్తామో అలాగే మాతో కూడా వ్యవహరించండి.. అని భారత్‌ను అధ్యక్షుడు ట్రంప్ కోరుతున్నారు' ట్రంప్ యంత్రాంగం ఏళ్లుగా తప్పులను సరిదిద్దుకుంది... కాబట్టి మేము దీన్ని పరిష్కరించే వరకు వేరే విధంగా సుంకాన్ని కోరుకుంటున్నాం' అని ఆయన అన్నారు. 'అది అధ్యక్షుడి నమూనా, మీరు దానిని అంగీకరించాలి లేదా ప్రపంచంలోని గొప్ప వినియోగదారుడితో వ్యాపారం చేయడం మీకు కష్టమవుతుంది' అని పేర్కొన్నారు.అయితే, కొద్ది నెలలుగా భారత్-అమెరికాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దశలో ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతూనే.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తుందనే సాకుతో 50 శాతం సుంకాలను విధించారు. దీంతో కొన్ని దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య కొనసాగుతోన్న బలమైన సంబంధాలు ప్రశ్నార్థకంగా మారాయి. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. తర్వాత రష్యా ఆయిల్ పేరు చెప్పి మరో 25 శాతం కలిపి 50 శాతానికి పెంచారు. బ్రెజిల్ తర్వాత అత్యధికంగా భారత్‌పైనే టారిఫ్‌లు విధించింది.రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌తో యుద్ధానికి మాస్కోకు నిధులు సమకూరుస్తోందని డొనాల్డ్ ట్రంప్, అతడి యంత్రాంగం ఆరోపిస్తోంది. అయితే, ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. ట్రంప్ సుంకాలు అన్యాయమైనవి, అనవసరమైనవి, అనూహ్యమైనవిగా అభివర్ణించింది. రష్యా క్రూడ్ ఆయిల్ కొనుగోళ్లను సమర్థించుకున్న భారత్, తన ఇంధన కొనుగోలు జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ పరిస్థితుల ఆధారంగా నడుస్తుందని పునరుద్ఘాటిస్తోంది. చైనాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఏడాది అమెరికా రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొకోతప్పదని అమెరికన్ అగ్రికల్చరల్ సంస్థలు హెచ్చరించినట్టు బీబీసీ నివేదించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. దీంతో చైనా నుంచి అమెరికా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు దారుణంగా పడిపోయాయి. తత్ఫలితంగా అమెరికా రైతులు, చిన్న వ్యాపారాలు దివాళా తీశాయి. బ్లూమ్‌బర్గ్ జూలైలో సేకరించిన డేటా ప్రకారం, ఈ సంఖ్య ఐదేళ్ల గరిష్టానికి చేరుకుంది.వాణిజ్య చర్చలు కొనసాగుతున్నప్పటికీ టెక్నాలజీ యాక్సెస్, సుంకాలు, అరుదైన ఖనిజాల ఎగుమతుల వంటి అంశాల్లో అనే సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ వాణిజ్య చర్చలను ముందుకు తీసుకెళ్తున్న తరుణంలో అమెరికా రైతులకు ట్రంప్ యంత్రాంగం భారత్‌ను కొత్త మార్కెట్‌గా సృష్టించే ప్రయత్నం చేస్తోందని కనిపిస్తోంది.

# సామాన్య కార్యకర్త నుంచి.. అత్యున్నత స్థాయికి

**గాంధీనగర్ :** ప్రపంచ యవనికపై అగ్రరాజ్యం అమెరికా విధించిన ఆంక్షలను తట్టుకుంటూ భారతదేశం సగర్వంగా తలెత్తుకుని నిలబడింది. మరిన్ని దేశాలకు ఆదర్శంగా నిలిచింది.. దీనికి కారణం భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని అంటారు రాజకీయ విశ్లేషకులు. ప్రస్తుతం నరేంద్ర మోడీ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ నాయకులలో ఒకరిగా పరిగణించబడే ప్రధాని మోడీ సెప్టెంబర్ 17, 2025న తన 75వ పుట్టిన రోజును జరుపుకోనున్నారు. ఒక సామాన్య ప్రచారకర్త నుంచి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆ తర్వాత దేశ ప్రధానమంత్రి వరకు ఆయన ప్రయాణం చాలా స్ఫూర్తిదాయకం. ప్రధానమంత్రి మోడీ 1950 సెప్టెంబర్ 17న గుజరాత్‌లోని వాద్‌నగర్ అనే చిన్న పట్టణంలో జన్మించారు. ఆయన బాల్యం అత్యంత పేదరికంలో గడిచింది. ఆయన తండ్రి దామోదర్‌దాస్ ముల్చంద్ మోడీతో కలిసి వాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో టీ అమ్మేవారు. ఆయన తల్లి హీరాబెన్ ఒక సాధారణ గృహిణి. నలుగురు తోబుట్టువుల్లో మూడవ సంతానం ప్రధాని మోడీ. రేపు ప్రధాని మోడీ పుట్టిన రోజు సందర్భంగా అరుదైన ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రధానమంత్రి మోడీ చిన్నప్పటి నుంచి చాలా ఆశయంతో ఉండేవారని.. దేశానికి ఏదైనా సేవ చేయాలనే కల కనే వారని మోడీ పాఠశాల స్నేహితులు చెబుతున్నారు. ఆయనకు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. పాఠశాలలో చర్చా పోటీల్లో పాల్గొనేవారు. స్థానిక లైబ్రరీలో గంటల తరబడి చదువుతూ గడిపేవారు. ఆయనకు చిన్నప్పటి




నుంచి ఈత కొట్టడం కూడా ఇష్టం.భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కూడా ప్రధానమంత్రి ప్రజాదరణ పెరిగింది. ఈ ఏడాది జూలైలో విడుదలైన ఆమోద రేటింగ్ జాబితాలో డెమోక్రటిక్ నాయకుడు అగ్రస్థానంలో నిలిచారు. గత 11 సంవత్సరాలలో ప్రధానమంత్రి మోడీ అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని సగర్వంగా నిలబెట్టారు. నరేంద్ర మోడీ జీవిత కథ.. పోరాటం, అంకితభావం స్ఫూర్తిదాయకమైన గాథ అని చెప్పవచ్చు. ఆయన తన అసాధారణ నాయకత్వం, గొప్ప వ్యక్తిత్వంతో భారతదేశానికి కొత్త దిశానిర్దేశం చేసిన నాయకుడు. ఆయన నాయకత్వ సామర్థ్యం, ??దార్శనికత ,ప్రజా మద్దతు ఆయనను ప్రభావవంతమైన నాయకుడిగా మార్చాయి. తన నిర్ణయాలకు కట్టుబడి ఉండి.. తన లక్ష్యాలను సాధించడానికి కష్టపడి పనిచేసే బలమైన నాయకుడు. ఆయన నాయకత్వ సామర్థ్యం ఆయన్ని మన దేశంలో మాత్రమే కాదు ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన నాయకులలో ఒకరిగా నిలబెట్టిందిప్రధానమంత్రి భారతదేశ భవిష్యత్తు గురించి శ్రద్ధ వహించే దార్శనిక నాయకుడు. ఆయన అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిలో స్వచ్ఛ భారత్ అభియాన్, డిజిటల్ ఇండియా , మేక్ ఇన్ ఇండియా మొదలైనవి ఉన్నాయి. ఇవి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి సహాయపడుతున్నాడు. ప్రజల నుంచి లభిస్తున్న విస్తృత మద్దతు, ప్రజాదరణ, ఆయన వ్యక్తిత్వ అఖండ ప్రభావం ఆయనను దృఢ సంకల్పం కలిగిన నాయకుడిగా మార్చాయి. కష్టమైన నిర్ణయాలను కూడా సులభంగా అమలు చేయగల నేర్పరి తనం ఆయన సొంతం. నరేంద్ర మోడీ నాయకత్వ సామర్థ్యం, ??దార్శనికత .. ప్రజా మద్దతు ఫలితంగానే అని చెప్పవచ్చు. ఆయన తన జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. తన ప్రయాణంలో ఎదురైన ప్రతి సవాల్ ను ఆయన అధిగమించారు. ఈ లక్షణం మోడీ దృఢ సంకల్పానికి అద్దంగా నిలుస్తుంది.చిన్న వయసులోనే ఇంటిని వదిలి ప్రజా జీవితంలోకి ప్రవేశించిన నరేంద్ర మోడీ తన జీవితాంతం నిస్వార్థంగా దేశ సేవలోనే గడిపారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా అగ్రస్థానంలో ఉన్న మన దేశాన్ని అభివృద్ధి బాటలో పయనించే విధంగా అనేక సంస్కరణలు చేపట్టారు. మన దేశంలో మాత్రమే కాదు ప్రపంచంలోని అగ్ర నాయకులు కూడా మోడీ నాయకత్వాన్ని ప్రశంసల వర్షంతో నింపేస్తున్న సంగతి తెలిసిందే.

# గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం..

గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులకు కొనసాగిస్తోంది. హమాస్ అంతమే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఐడీఎఫ్ దాడుల్లో వందలాది మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా గాజాపై ఐడీఎఫ్ దళాలు భీకర దాడులకు పాల్పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున నుంచి గాజా అంతటా ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడుల్లో పదుల సంఖ్యలో పాలస్తీనియన్లు మరణించారు. దాదాపు 62 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఈ దాడులను పాలస్తీనా గ్రూప్ హమాస్ ఖండించింది. పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. మరోవైపు గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. మొత్తం 72 పేజీల నివేదికను విడుదల చేసింది.

హమాస్, ఇజ్రాయెల్ దాడులు రెండేండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. 2023, అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సరిహద్దుల్లోని హమాస్ దాడికి పాల్పడింది. దీంతో 1200 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. మరో 251 మందిని బందీలుగా హమాస్ పట్టుకెళ్లింది. ప్రతిగా గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడుతున్నది. హమాస్ తుదముట్టించే వరకు గాజాపై దాడులు చేస్తామంటూ ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇందులో భాగంగా గాజా స్ట్రిప్‌పై భీకర దాడులు చేపడుతోంది. ఇక ఈ దాడుల్లో ఇప్పటివరకు 64 వేల మందికిపైగా పాలస్తీనియన్లు (%ఖుశ్రీవర్‌ఱఅఱఖుఅం%) మృతిచెందారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 65 వేల



మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. మరో 400 మందికిపైగా ఆచూకీలేకుండా పోయారని తెలిపింది. మృతుల్లో సగానికిపైగా మహిళలు, చిన్నారులు ఉన్నారని పేర్కొంది.

## భక్తుల డబ్బు.. కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు

**ఇంటర్నెట్ డెస్క్:** దేవాలయాలకు భక్తులు సమర్పించే డబ్బులు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమంటూ మద్రాస్ హైకోర్టుకు చెందిన మదురై బెంచ్ ఇటీవల ఇచ్చిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరించింది. తమిళనాడులోని ఐదు దేవాలయాలకు చెందిన నిధులతో రాష్ట్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పిటిషనర్లు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ తమిళనాడు సర్కారు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

**ఆ ఇంటి అమ్మవారిలో రోజుకో రూపం..**

విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన 'సుప్రీం' ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "కల్యాణ మండపాల ఏర్పాటు కోసం భక్తులు తమ డబ్బును ఆలయాలకు ఇవ్వరు. ఆలయ అభివృద్ధి వంటి వాటికోసం ఇస్తుంటారు. ఒక ఆలయ ప్రాంగణంలో పెళ్లి జరుగుతుంటే.. అక్కడ అసభ్యకరమైన పాటలు ప్లే చేస్తుంటే.. అది సరైనదేనా?" అని ప్రశ్నించింది. ఆ డబ్బును విద్య, వైద్యం వంటి దాతృత్వ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే బాగుంటుందని సూచించింది. తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది.

## 16వేల మంది విదేశీయులను దేశం నుంచి బహిష్కరించనున్న కేంద్రం..!



**ఇంటర్నెట్ డెస్క్:** దేశం నుంచి 16వేల మంది విదేశీయులను బహిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌లో ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త వలస చట్టాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నార్కోటిక్స్ రవాణా ఇతర నేరాలతో సంబంధమున్న దాదాపు 16,000 మంది విదేశీయులను దేశంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అదుపులోకి తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం నిర్బంధ కేంద్రాల్లో ఉన్నవారందరినీ దేశం నుంచి బహిష్కరించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పలు జాతీయ మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. ఫోర్జరీ పత్రాలతో దేశంలో అక్రమంగా నివాసముంటున్న విదేశీయులకు కఠిన శిక్షలు విధించే కొత్త చట్టం సెప్టెంబర్ 2న అమల్లోకి వచ్చింది. వలసలు, విదేశీయుల చట్టం-2025గా వ్యవహరిస్తున్న దీనిని బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఆమోదించగా.. ఏప్రిల్ 4న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. నాలుగు పాత చట్టాల స్థానంలో ఇది అమల్లోకి వచ్చింది. ఇందులోభాగంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దేశంలోకి ప్రవేశించిన విదేశీయులకు కనిష్టంగా రెండేళ్లు, గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష.. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా.. భారత్‌లో పేదరికంలో మగ్గుతున్నవారు కోట్లాది మంది ఉన్నారు. పేదరికాన్ని అంతం చేయడానికి ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. అయితే ఈ సమస్య పరిష్కారంలో అక్రమ వలసలు ప్రధాన అడ్డుగోడగా నిలుస్తున్నాయి. సరిహద్దు దేశాల నుంచి అక్రమంగా ప్రవేశించిన విదేశీయులు చట్టవిరుద్ధంగా ఉండడమే కాకుండా అసలైన లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమఫలాలను వీరు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం అమల్లోకి తీసుకువచ్చిన వలసలు, విదేశీయుల చట్టం ద్వారా వారిని దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటోంది.

## భారత్ నుంచి డీజిల్ దిగుమతులపై ఉక్రెయిన్ ఆంక్షలు



**న్యూఢిల్లీ :** భారతదేశం నుంచి చేసుకుంటున్న డీజిల్ దిగుమతులపై ఆంక్షలు విధించాలని ఉక్రెయిన్ నిర్ణయించింది, అక్టోబర్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. రష్యా నుంచి ముడి చమురుపై ఆధారపడటంపై ఆందోళనలు చెలరేగాయి. ఉక్రేనియా ఎనర్జీ కన్సల్టెన్సీ ఎన్‌కోర్ ప్రకారం.. ఉక్రేనియా భద్రతా సంస్థలు భారతదేశం నుంచి వచ్చే ప్రతి డీజిల్ దిగుమతిని రష్యా మూలమైన భాగాలను గుర్తించడానికి ప్రయోగశాల పరీక్షలు చేపట్టాలని ఆదేశించాయని కన్సల్టెన్సీ పేర్కొంది., శక్తి కన్సల్టెన్సీ ం-95 గతంలో ఈ వేసవిలో ఒక ప్రధాన ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారం మూసివేయడం తో ఇంధన వ్యాపారులు విదేశీ సరఫరాదారులపై ఆధారపడవలసి వచ్చిందని పేర్కొంది. రష్యా ముడి చమురును గణనీయమైన పరిమాణంలో శుద్ధి చేసే దేశాల్లో భారతదేశం ఒకటి. ం-95 ప్రకారం, ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఒకానొక సమయంలో భారత్ నుంచి దిగుమతి చేసుకునే డీజిల్‌ను సేకరించింది. ఎందుకంటే ఇది సోవియట్ అనంతర సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు గుర్తించారు. ఎన్‌కోర్ గణాంకాల ప్రకారం, ఒక్క ఆగస్టులోనే ఉక్రెయిన్ దేశం భారత్ నుండి 119,000 టన్నుల డీజిల్‌ను దిగుమతి చేసుకుంది. ఆ నెలలో మొత్తం డీజిల్ దిగుమతుల్లో ఇది 18 శాతం వాటా అని రాయిటర్స్ నివేదించింది. 2022లో రష్యా పూర్తిస్థాయి దాడిని ప్రారంభించే ముందు, పరిమిత దేశీయ ఉత్పత్తిని భర్తీ చేయడానికి ఉక్రెయిన్ బెలారస్, రష్యా నుంచి ముడి చమురు, ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధారపడింది. అయితే, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ ప్రధానంగా పశ్చిమ ఐరోపాలోని దేశాలపై ఆధార పడుతోంది. ం-95 ప్రకారం, 2025 మొదటి అర్ధభాగంలో ఉక్రెయిన్‌లోకి మొత్తం డీజిల్ దిగుమతులు 13 శాతం తగ్గి, 2.74 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకున్నాయి. ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారాలు, నిల్వ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని రష్యన్ డ్రోన్ దాడులు, క్షిపణి దాడులు కొనసాగుతున్న క్రమంలో ఈ ఆంక్షలు వచ్చాయి.ఉక్రేనియా డ్రోన్లు రష్యా వాయువ్య ప్రాంతంలోని కిరిషి చమురు శుద్ధి కర్మాగారంపై ఆదివారం నాడు దాడి చేశాయి. ఇది దేశంలోనే అతి రిఫైనరీ. డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయని ఫ్రాన్స్ 24 నివేదించింది. సుర్గుట్నెఫ్టెగాజ్ లోని కిరిషినెఫ్టోర్గ్సిన్తేజ్ రిఫైనరీ రష్యాలోని అతిపెద్ద రెండు రిఫైనరీలలో ఒకటి. ఉక్రేనియా డ్రోన్లు దాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని రష్యన్ అధికారులు కూడా ధృవీకరించారు. ముడిచమురు శుద్ధి కర్మాగారంపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ డ్రోన్ కమాండ్ పేర్కొంది. విజయవంతమైన దాడిని నిర్వహించామని స్పష్టం చేసింది.

# తెలంగాణ రైతు సంక్షేమం దేశం మొత్తానికి ఆదర్శం

**ఢిల్లీ :** రైతులందరికీ ఉపయోగపడే విధంగా స్కీములన్నిటిని ఒకే గొడుగు కిందకు కేంద్ర ప్రభుత్వం తీసుకు రావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. దేశ రైతాంగానికి ఉపయోగపడే పాలసీలను రూపొందించే కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ని ఈ సందర్భంగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

ఇవాళ(మంగళవారం) నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అగ్రికల్చర్ రబీ క్యాంపెయిన్ - 2025ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో పలు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులు, కార్యదర్శులు, వ్యవసాయ శాఖ నిపుణులతో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. రైతును ఏ రకంగా కాపాడాలి, రైతు ఆదాయాన్ని ఏ రకంగా పెంచాలి, భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమావేశంలో చర్చించారు.



**పామాయిల్ సాగులో తెలంగాణ ముందంజ**

ఈ సమావేశంలో కొన్ని అంశాలపై ప్రస్తావించడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 1960లో చేసిన విత్తన చట్టం ఇప్పటికీ కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు ఈ అంశాన్ని ఎందుకు పున: పరిశీలించలేదని ప్రశ్నించారు. దానివల్ల విత్తన కంపెనీలు దగా, మోసం చేసిన రైతులు నష్టపోయిన ఏ మాత్రం వెసులుబాటు లేదని తెలిపారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో నూతన విత్తన చట్టాన్ని, భారత రైతాంగానికి శ్రేయస్సు చేకూర్చే విధంగా అంగీకరించాలని సూచించారు. భారతదేశంలోనే ఎక్కువ ఎకరాల్లో పామాయిల్ సాగుచేసే రాష్ట్రంగా తెలంగాణ ముందంజలో ఉందని ఉద్ఘాటించారు. పామాయిల్‌పై విధించిన ఇంపోర్ట్ ట్యాక్స్‌ను పెంచి భారత రైతులకు ఆయిల్ ఫామ్ వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా చేయాలని ఆకాంక్షించారు. వ్యవసాయానికి సంబంధించి కేంద్రంలో అనేక స్కీంలు అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

**ఫెర్టిలైజర్స్‌ను రేషనలైజ్ చేయాలి..**

తెలంగాణలో చేపట్టిన రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, 24 గంటల విద్యుత్ ఏ రాష్ట్రంలో జరుగని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు మన రాష్ట్రంలో జరుగుతున్నాయని వివరించారు. వీటిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. ఫెర్టిలైజర్స్‌ను రేషనలైజ్ చేయకపోవడంతో భూసారం పడిపోతుందని తెలిపారు. ఫలితంగా యూరియాను సరిగా సరఫరా చేయలేకపోతున్నారని అన్నారు. ఇందువల్ల రైతన్నకి యూరియా కొరత వచ్చిందని చెప్పుకొచ్చారు. విదేశాల నుంచి యూరియా దిగుమతులపై కేంద్రప్రభుత్వం ఆధారపడిందని వెల్లడించారు. ఇక్కడ ఉన్న ఫ్యాక్టరీలు సైతం పనిచేయలేకపోయాయని అన్నారు. సరైన సమయంలో యూరియా సరఫరా చేయకపోవడంతో దిగుబడి తగ్గుతుందనే అపోహతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఫెర్టిలైజర్స్‌ను రేషనలైజ్ చేసి రేట్లు తగ్గించాలని సూచించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

**అనుప్రియ పటేల్‌తో తుమ్మల భేటీ..**

అలాగే, యూరియా కొరతపై కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ(మంగళవారం) కలిశారు. యూరియా కొరత అంశంలో సహాయం అందిస్తామని అనుప్రియ పటేల్ చెప్పారని అన్నారు. ఈ వారంలో 80,000 మెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు ఇచ్చారని, మరో 40,000 వేల మెట్రిక్ టన్నులు ఇవ్వాలని కోరానని చెప్పారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఈ ఖరీఫ్‌లో అవసరం ఉందని తెలిపారు. యూరియా ఇస్తే రబీకి కూడా తాము ప్లాన్ చేసుకోగలుగుతామని అన్నారు. రబీలో ఇచ్చిన ప్లాన్ సైతం అమలు అయ్యేలా చూడాలని కోరారు. ఈ వారంలో మరో 40 వేల మెట్రిక్ టన్నులు ఇస్తామని అనుప్రియ పటేల్ హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# స్పీకర్ నిర్ణయంపైనే భవిష్యత్తు

హైదరాబాద్ తెలంగాణ అసెంబ్లీలో జరుగుతున్న డిఫెక్షన్ కేసులు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతను పెంచుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులు యాంటీ?డిఫెక్షన్ చట్టాన్ని, రాజ్యాంగ స్థానాన్ని ప్రశ్నించేలా మలుపు తిప్పుతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలు, స్పీకర్ నోటీసులు, పార్టీల వాదనలు ? ఈ ఘటనలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు దాదంబోయినా నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలె యాదయ్య, ఎం. సంజయ్ కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి, మహీపాల్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరికేపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరినట్టు బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి, ట్రెజరీ బెంచీల్లో కూర్చున్నారని బీఆర్ఎస్ వాదన. ఇది యాంటీ డిఫెక్షన్ చట్టానికి (10వ షెడ్యూల్) విరుద్ధమని, డిస్క్వాలిఫికేషన్ పిటిషన్లు 2024 మార్చి ఏప్రిల్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించారు. సుప్రీం కోర్టు 2025 జూలై 31న జారీ చేసిన ఆదేశాల్లో, స్పీకర్‌కు మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని డైరెక్ట్ చేసింది. దీంతో 2025, ఆగస్టు 23న స్పీకర్ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారా లేదా అనే వివరణ కోరారు. ఇది డిఫెక్షన్ కేసుల్లో స్పీకర్ నిర్ణయాలపై రాజ్యాంగపరమైన ప్రశ్నలను లేవనెత్తింది. కోర్టు, స్పీకర్/ఛైర్మన్‌లకు డిఫెక్షన్ నిర్ణయాల బాధ్యతను అప్పగించడం సమర్థవంతమా అని పార్లమెంట్‌ను పరిశీలించమని సూచించింది.స్పీకర్ నోటీసులకు స్పందిస్తూ, 10 మంది ఎమ్మెల్యేలలో 8 మంది 2025 సెప్టెంబర్ 11 నాటికి వివరణలు సమర్పించారు. వారంతా ఐక్యంగా, 'మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నాం, కాంగ్రెస్‌లో చేరలేదు' అని పేర్కొన్నారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశాలు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సేవల కోసమే అని వాదించారు. కొందరు 'టెక్నికల్‌గా బీఆర్ఎస్‌లోనే ఉన్నాం' అని, సోషల్ మీడియా హ్యాండిల్స్ మార్చలేదని చెప్పుకున్నారు. ఈ ఎమ్మెల్యేలు తమ చట్టపరమైన సలహాలతో స్పందిస్తున్నారు. కొందరు ఢిల్లీలో సుప్రీం కోర్టు న్యాయవా దులను సంప్రదించి, ప్రజల సేవ కోసం అధికార పార్టీలోకి వెళ్లామని, ద్రోహం చేయలేదని వాదిస్తున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వివరణలను తిరస్కరిస్తూ, 2025 సెప్టెంబర్ 13 నాటికి స్పీకర్‌కు కౌంటర్ వాదనలు సమర్పించనుంది. పార్టీ నేతలు, 'ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతల సమక్షంలో చేరారు, కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్నారు, కట్టడి బెంచీల్లో కూర్చున్నారు' అని ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్‌లో డిజిటల్ ఆధారాలు సేకరిస్తున్నారు. దానం నాగేందర్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. కడియం శ్రీహరి కూతురు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చాక దానిని తిరస్కరించి కాంగ్రెస్‌లో చేరి పోటీచేసి గెలిచారు.ఈ ఫిరాయింపుల వివాదం తెలంగాణ రాజకీయాల్లో అస్థిరతను తెలియజేస్తోంది. బీఆర్ఎస్ 2023లో 39 సీట్లతో రెండో స్థానంలో ఉండగా, 10 మంది ఎమ్మెల్యేలు చెరస్తే 29కి తగ్గ తుంది. ఇది పార్టీ బలాన్ని బలహీనపరుస్తుంది. కాంగ్రెస్‌కు (64 సీట్లు) ఇది అదనపు మద్దతు. కానీ డిస్క్వాలిఫికేషన్ అయితే బైఎలక్షన్లు జరగవచ్చు. అప్పుడు రాజకీయ పరిణా మాలు మారే అవకాశం ఉంది. చట్టపరంగా ఫిరాయింపులను నిరోధిస్తుంది. కానీ ఎమ్మెల్యేలు 'స్వచ్ఛందంగా' పార్టీ మారితే పార్టీ విలీనం ద్వారా మినహాయింపు పొందుతారు. బీఆర్ఎస్ ఆధారాలు (వీడియోలు, సమావేశాలు) బలంగా ఉంటే స్పీకర్ డిస్క్వాలిఫికేషన్‌కు ఆమోదం ఇవ్వవచ్చు. స్పీకర్ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపును తీసుకురావొచ్చు.



# సోయరైతులకు కష్టాలు

**నిజామాబాద్ :** ఆరుగాలం కష్టించి పనిచేసే రైతన్నకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసాయన సంతోషం వారిని సమస్యలుకి నెట్టింది. ఓవైపు యూరియా కష్టాలు, మరోవైపు వానలతో పంటలు దెబ్బ తినడంతో రైతులు నష్టాలను చవి చూడాల్సి వస్తుంది.సోయా సాగుకు నడుం బిగించిన రైతులకు అధిక దిగుబడులు సాధించి లాభాలను అర్జించాలన్న ఆశ నిరాశగా మిగిలిపోతుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సోయా పంటలు నేలకొరిగి దర్శనమిస్తున్నాయి. సోయా పంటల పరిస్థితిని చూసి రైతులు లబోదిబోమంటున్నారు. కామారెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల్లో సోయా పంట సాగుకు రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తారు.జిల్లాలోని గాంధారి, తాడువాయి, లింగంపేట్, మధునూర్, బిచ్కుంద, జుక్కల్, మండలాల్లో నీ గ్రామాల్లో ఎక్కువగా రైతులు సోయా సాగు చేశారు. పంట ఎదుగుతున్న తరుణంలో భారీ వర్షాలు కురియడంతో సోయా పంట తీవ్రంగా దెబ్బతింటుంది. పంట ప్రగతి దశలోనే నిండా ముంచేతడంతో సోయా పరిస్థితి సోగయా లాగా తయారయింది.సోయా సాగు జరుగుతున్న సమయంలో వానాల వల్ల తమ పంట పూర్తిగా నష్టపోయామని, పంటపై పెట్టిన పెట్టుబడి పూర్తిగా నష్టపోయినట్లేనని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపరిహారం అందించేందుకు కోరుతున్నారు.కురుస్తున్న వర్షాలకు జిల్లాలో వరి సాగు కూడా ఆశాజనకంగానే మారిందని, వానలతో వరి పంట తడిసి ముద్దవ్వడంతో ధాన్యం పొ ట్టపగిలి పంట సాగుకు నష్టం వాటిల్లి పరిస్థితి ఉంటుందని రైతులు దిగులు దిగాలు చెందుతున్నారు. జిల్లాలో అత్యధికంగా అన్ని మండలాల్లో వరి సాగు అధికంగా జరుగుతోంది. చిన్న సన్నకారు రైతులు నానా తంటాలు పడి పంట సాగుకు అడుగులు వేసినప్పుడు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఇబ్బంది పెడుతున్నాయి.నియోజకవర్గంలో వరి సాగు పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని రైతు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల కొరత ఇబ్బంది పెట్టినప్పటికీ పంట సాగుకు సన్నద్ధమవుతుంటే భారీ వర్షాలు రైతులను మరింత బాధపెడుతున్నాయని పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో కూడా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల మరిన్ని వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచిస్తుండడంతో పంట సాగు పరిస్థితి ఏ విధంగా ఉంటుందన్న ఆలోచన రైతులను కృంగదీస్తోంది.గత రెండు మూడు రోజులుగా కామారెడ్డి జిల్లాను రెడ్ అలర్ట్ ప్రకటించడంతో కురుస్తున్న వర్షాలకు పంట భూములు నీటితో నిండిపోయాయి. మరో రెండు మూడు రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే వరి పంట సాగు కూడా ప్రశ్నార్థకంగా మారి ప్రమాదం ఉంటుందని వ్యవసాయ అధికారులు సైతం స్పష్టం చేస్తున్నారు.



## ఇందిరమ్మ ఇళ్లకు భారీగా నిధులు

-మొదటిపేజీ తరువాయి

స్థాయికి చేరుకోగా, మరో 8,633 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ పనుల పురోగతిని బట్టి లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ తెలిపింది. ప్రతి సోమవారం ఈ చెల్లింపుల ప్రక్రియను చేపడుతున్నామని, ఇందులో భాగంగా గత సోమవారం 13,841 మంది లబ్ధిదారులకు రూ.146.30 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ విధానం ద్వారా లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఇళ్లను వేగంగా పూర్తి చేసుకునేందుకు వీలు కలుగుతోందని అధికారులు తెలిపారు.

## రేవంత్ రెడ్డి వల్ల హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది

-మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌ను తెలంగాణ ఆర్థిక ఇంజిన్‌గా మార్చిన గత పదేళ్ల తమ ప్రభుత్వ పాలనకు భిన్నంగా, కాంగ్రెస్ పార్టీ విధానాలు నగరాన్ని పూర్తిగా కుప్పకూల్చేలా ఉన్నాయని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే భారత రాష్ట్ర సమితి మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్ రెడ్డి సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, అన్ని రంగాలపై కాంగ్రెస్ అసమర్థ విధానాల ప్రతికూల ప్రభావం తీవ్రంగా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. సమాజంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ అసమర్థ విధానాల వల్ల నష్టపోయాయని ఆయన అన్నారు.

ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశానికి కేటీఆర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ సీనియర్ నేతలు కేటీఆర్‌తో చర్చించారు. ఈ ఉప ఎన్నికలో పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## ట్రాన్స్‌జెండర్‌లకు గౌరవం..

-మొదటిపేజీ తరువాయి

అడ్లూరి లక్ష్మణ్ కుమార్. సెక్యూరిటీ గార్డు నియామకాల కోసం దాదాపు 300 నుంచి 400 మంది దరఖాస్తు చేసుకోగా, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.

**ఆదర్శంగా నిలవాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతికి, వారు ఆత్మగౌరవంతో జీవించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారని.. ఈ నేపథ్యంలోనే వీరిని నియమించారని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. వారు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఇతర ట్రాన్స్‌జెండర్లకు కూడా ఆదర్శంగా నిలవాలని చెప్పుకొచ్చారు. వీరు ఈ సమాజానికి ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి కచ్చితంగా అమలు చేస్తారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

## కవిత టార్గెట్ యూత్...



**వరంగల్ :** అవి తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న రోజులు. సాంస్కృతిక ఆయుధంతో కవిత ఉద్యమంలోకి వచ్చారు. నెత్తిన బతుకమ్మను ఎత్తుకొని.. గౌరమ్మను కీర్తిస్తూ.. తెలంగాణ ఉద్యమ ఆవశ్యకతను చాటిచెబుతూ అడుగులు వేశారు. చంటి బిడ్డ తల్లి అయినప్పటికీ ఉద్యమం ముందు వరుసలో నడిచారు. నాడు ఉద్యమం చేస్తున్న రోజులో ఎన్నడూ కూడా యువతను భావోద్వేగానికి గురి కావద్దని చెబుతూ ఉండేవారు కవిత.. చదువులను నిర్లక్ష్యం చేయొద్దని.. ఏనాటికైనా తెలంగాణ వస్తుందని.. తెలంగాణ రాష్ట్రంలోనే సమస్యలు తీరుతాయని స్పష్టంగా చెప్పేవారు.వాస్తవానికి రాజకీయ నాయకులు యువతను తమ స్వార్థం కోసం వాడుకుంటారు. తమ రాజకీయ ప్రాపకం కోసం ఉపయోగించుకుంటారు. కానీ కవిత అలా కాదు. అలాంటి పని కవిత ఎన్నడూ చేయలేదు. అందువల్లే ఆమెను యువత విపరీతంగా ఆరాధిస్తూ ఉంటుంది. ఇటీవల జాగృతి ఆధ్వర్యంలో లీడర్ అనే కార్యక్రమం నిర్వహిస్తే దానికి వేలాదిమందిగా యువత హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో కవిత చెప్పిన మాటలన్నిటినీ శ్రద్ధగా విన్నారు. రాజకీయం మాత్రమే కాదు, నాయకత్వం అంటే ఏమిటో కవిత వివరించిన తీరుకు యువత ఫిదా అయ్యారు. రాజకీయాలు అంటేనే విరక్తి కలుగుతూ.. రాజకీయ నాయకులు అంటేనే హేయమైన భావం విస్తరించిన నేటి రోజుల్లో కవిత మాటలను యువత శ్రద్ధగా వినడం నిజంగా ఆశ్చర్యకరమే. అయితే ఆ మాటల్లో రాజకీయాల్లోకి రావాలని గాని.. ఒకరి మీద పెత్తనం సాగించాలని కానీ కవిత చెప్పలేదు. జస్ట్ సమాజం కోసం ఎంతవరకు అయితే అంతవరకు చేయడమే మనిషి నైజం అని కవిత చెప్పిన మాటలు యువతను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అందువల్లే కవిత నేడు తన పూర్వ రాజకీయ క్షేత్రం నుంచి బయటికి వచ్చినప్పటికీ కూడా ఇంతమంది ఆమెను ఆరాధిస్తున్నారు.ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన ఫీజుబకాయిలు విపరీతంగా పెరిగిపోయాయి. అటు స్థానిక సమస్య కూడా విద్యార్థులను ఇబ్బంది పెడుతోంది. ఇవే విషయాలను కవితంగా ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నిస్తున్నారు.. తన సామాజిక మాధ్యమాల వేదికగానే ప్రభుత్వాన్ని తూర్పారబడుతున్నారు. ముఖ్యంగా ఏపీలో కలిసిన ఆ ఏడు మండలాల ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో కవిత అనేక సందర్భాల్లో చెప్పారు. ఇటీవల భద్రాచలంలో పర్యటించినప్పుడు కూడా ఆ ఏడు మండలాలను తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. అవసరమైతే దానికోసం తాను ఉద్యమం చేస్తానని కూడా ప్రకటించారు.ఇక ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలోనూ కవిత తగ్గడం లేదు. తను శాసనమండలి సభ్యురాలుగా ఉన్నప్పుడు.. అనేక పర్యాయాలు విద్యార్థుల ఫీజు కష్టాల గురించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం రాజకీయాలను పక్కనపెట్టి విద్యార్థుల సమస్యల పరిష్కరించాలని.. ఎందుకంటే విద్యార్థులు చదువులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ఆమె శాసనమండలిలో వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఇటీవల కాలంలో విద్యార్థుల సమస్యల గురించి ఈ స్థాయిలో అటు అధికార పక్షంగాని.. ఇటు ప్రతిపక్షం గాని మాట్లాడలేదు. పైగా రాజకీయంగా వాడుకోవడానికి అవకాశం వచ్చినప్పటికీ కూడా కవిత కేవలం విద్యార్థుల భవిష్యత్తు గురించి మాత్రమే మాట్లాడారు. వాస్తవానికి రాజకీయ నాయకులు ఎంత మంది అయినా ఉండవచ్చు. వారి రాజకీయాల కోసం ఏమైనా చేస్తూ ఉండవచ్చు. కానీ ప్రజల బాగు కోసం పనిచేసేవారు కొంతమంది మాత్రమే ఉంటారు. ఆ జాబితాలో కవిత ముందు వరుసలో ఉంటారు. తదుపరి రాజకీయ క్షేత్రం ఎలా నిర్మించుకుంటారు.. ఎలాంటి రాజకీయాలను ఎంచుకుంటారు.. అనే విషయాలను పక్కన పెడితే ఇప్పటివరకు అయితే యువత విషయంలో తిరుగులేని ఉద్యమాన్ని చేస్తున్నారు కవిత. భవిష్యత్తు కాలంలో ఆ యువతే కవితకు అండా దండా



# రాత్రి నిద్రకు ముందు నెయ్యితో అరికాళ్లకు మసాజ్ చేస్తే..

ఒకప్పుడు చాలా మంది ప్రతి రాత్రి పడుకునే ముందు తమ పాదాలకు నెయ్యి రాసుకునే పద్ధతిని అనుసరించేవారు. దీని వెనుక అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి మరీ. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడతాయి. కాబట్టి ఇది ఎలాంటి సమస్యలకు ప్రయోజనకరంగా ఉంటుంది? చాలా మందికి పడుకునే ముందు పాదాలను మసాజ్ చేసే అలవాటు ఉంటుంది. కొందరు కొబ్బరి నూనెతో చేస్తారు.. మరికొందరు నెయ్యితో చేస్తారు. ఈ రకమైన మసాజ్ చేయడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. నెయ్యితో పాదాలను మసాజ్ చేయడం వల్ల మరిన్ని ప్రయోజనాలు లభిస్తాయి. కానీ ఇటీవలి కాలంలో ఎవరూ ఈ పురాతన పద్ధతిపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. కానీ ఒకప్పుడు చాలా మంది ప్రతి రాత్రి పడుకునే ముందు తమ పాదాలకు నెయ్యి రాసుకునే పద్ధతిని అనుసరించేవారు. దీని వెనుక అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి మరీ. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడతాయి. కాబట్టి ఇది ఎలాంటి సమస్యలకు ప్రయోజనకరంగా ఉంటుంది? పాదాలకు నెయ్యి రాయడం వల్ల శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. నెయ్యిలో ఉండే విటమిన్లు ఎ, ఇ, డి మొదలైన పోషకాలు రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి పనిచేస్తాయి. ముఖ్యమైన కొవ్వు ఆమ్లాలు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా వ్యాధులు, ఇన్ఫెక్షన్లను నివారించడంలో కూడా సహాయపడతాయి. రోగనిరోధక శక్తి పెరిగినప్పుడు సీజనల్ జలుబు, ఫ్లూ వంటి అనేక సమస్యలు దూరంగా ఉంటాయి. పాదాలు ఎక్కువగా నేలపైనే ఉండటం వల్ల, పర్యావరణ కారకాల వల్ల చర్మం క్రమంగా పొడిగా, గరుకుగా మారుతుంది. నెయ్యి ఇటువంటి సమస్యలకు గొప్ప పరిష్కారం. ఇది తేమ లక్షణాలను కలిగి ఉంటుంది. చర్మానికి పోషణను అందిస్తుంది. ఇది చర్మాన్ని మృదువుగా చేస్తుంది. అంతేకాకుండా పగిలిన మడమలకు నెయ్యితో మసాజ్ చేయడం వల్ల పగిలిన మడమల రూపాన్ని కూడా తగ్గించవచ్చు. ఇది పాదాలపై చర్మాన్ని మృదువుగా చేస్తుంది. ఇందుకోసం ముందుగా పాదాలను గోరువెచ్చని నీటితో కడిగి ఆరబెట్టాలి. ఇవి పూర్తిగా ఆరిపోయాక కొంచెం నెయ్యిని తీసుకొని పాదాలకు అప్లై చేసి బాగా మసాజ్ చేయాలి. అరికాళ్ళపై ఉన్న నరాల చివరలు, రిఫ్లెక్సాలజీ పాయింట్లు మన శరీరంలోని వివిధ వ్యవస్థలు, అవయవాలకు అనుసంధానించబడి ఉంటాయి. అరికాళ్ళను మసాజ్ చేసినప్పుడు ఆ పీడన బిందువులు ప్రేరేపించబడతాయి. ఇది శరీరమంతా రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రక్త ప్రసరణ పెరగడం వల్ల కణాలు, కణజాలాలు ఆక్సిజన్ ద్వారా అవసరమైన పోషకాలను సరిగ్గా పొందుతాయి. అంతేకాకుండా పాదాలను నెయ్యితో మసాజ్ చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. మనస్సు ప్రశాంతంగా, విశ్రాంతిగా ఉంటుంది. మనకు నిద్ర చాలా ముఖ్యం. సరైన నిద్ర రాకపోతే, రాత్రిపూట పాదాలకు వెన్న లేదా నెయ్యి రాసి మసాజ్ చేయడం మంచిది. ఇది మంచి నిద్ర పొందడానికి సహాయపడుతుంది. శరీర శక్తి కూడా సమతుల్యంగా ఉంటుంది. ఒత్తిడి తగ్గుతుంది. నాడీ వ్యవస్థ విశ్రాంతి పొందుతుంది. ఫలితంగా ఎటువంటి ఆలోచనలు లేకుండా నిద్రపోవచ్చు. అంతేకాదు, కాలుష్యం కారణంగా వివిధ విషపదార్థాలు మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. కాబట్టి దీని నుంచి ఉపశమనం పొందడానికి పాదాలకు మసాజ్ చేయడం మంచిది. ఇది శరీరం నుంచి హానికరమైన అంశాలను తొలగిస్తుంది.

# రోజు ఒక స్పూను ఈ గింజలు తింటే చాలు..



పొద్దుతిరుగుడు విత్తనాలు చాలా శక్తివంతమైనవి. కేవలం 30 గ్రాముల పొద్దుతిరుగుడు విత్తనాలలో 5.5 గ్రాముల ప్రోటీన్, 14 గ్రాముల ఆరోగ్యకరమైన కొవ్వు ఉంటుంది.ఇది కాకుండా, అనేక రకాల విటమిన్లు, జింక్, మాంగనీస్, రాగి, మెగ్నీషియం, ఇనుము, పాంతోతేనిక్ ఆమ్లం వంటి అంశాలు నిండి ఉంటాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఇతర విత్తనాల కంటే ఎక్కువ విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. క్యాన్సర్‌ను నివారించగల సామర్థ్యం – క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ వైద్యుల అభిప్రాయం ప్రకారం, పొద్దుతిరుగుడు విత్తనాలు క్యాన్సర్‌ను నివారించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి విముక్తిగా ఉంచుతాయి. అందువల్ల, మీరు పొద్దుతిరుగుడు విత్తనాలను క్రమం తప్పకుండా తీసుకుంటే, మీరు అనేక రకాల క్యాన్సర్‌ల నుండి రక్షించబడతారు. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది – పొద్దుతిరుగుడు విత్తనాలలో ఉండే విటమిన్ ఇ క్యాన్సర్ నిరోధకమే కాకుండా గుండెను బలంగా చేయడంలో కూడా చాలా శక్తివంతమైనది. ఇది గుండె నుండి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగిస్తుందని, ట్రైగ్లిజరైడ్‌లను కూడా తగ్గిస్తుందని అధ్యయనాలు నిరూపించాయి. ఇది గుండెలో మంటను నివారిస్తుంది. థైరాయిడ్ కు దివ్యౌషధం – థైరాయిడ్ లేదా ఆర్థరైటిస్ సమస్యలు ఉన్నవారు పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవాలి. పొద్దుతిరుగుడు విత్తనాలు వాపును తగ్గిస్తాయి. ఇది ఎముకలను బలపరుస్తుంది. కణాల పెరుగుదలకు సహాయపడుతుంది. ఈ విత్తనంలో సరైన మొత్తంలో అయోడిన్, సెలీనియం ఉంటాయి. ఇది థైరాయిడ్ హార్మోన్‌ను సమతుల్యం చేస్తుంది.డయాబెటిస్ నివారణ – పొద్దుతిరుగుడు విత్తనాలు డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. ఇది శరీరం నుండి ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది– పొద్దుతిరుగుడు విత్తనాలలో అనేక రకాల ఖనిజాలు ఉంటాయి.

# ఎండిన రొయ్యలు తింటే ఎన్ని లాభాలు



తక్కువ ఖర్చుతో లెక్కలేనన్ని పోషకాలను కలిగి ఉన్న చేపలు వివిధ వ్యాధులకు కూడా ఔషధంగా పనిచేస్తాయి. అంతేకాదు.. ఎండిన చేపలు, రొయ్యలు ప్రోటీన్ అద్భుతమైన మూలం. ఇది ముఖ్యంగా తీరప్రాంత చేపలు తినే వారికి మంచి బలాన్ని ఇస్తుంది. ఎండు చేపలలో అధిక ప్రోటీన్ లభిస్తుంది.100 గ్రాముల చేపలో 60%-%80 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది చేపల రకాన్ని బట్టి మారవచ్చు. అందువల్ల పోషకాహార లోపం ఉన్న పిల్లల పెరుగుదల, కండర ద్రవ్యరాశిని మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, పెరుగుదలను ప్రేరేపించడం వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. ఎండు రొయ్యల్లో ఖరీరానికి కావాల్సిన ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. కాల్షియం, ఐరన్, మేగ్నీషియం, ఫాస్పరస్, పోటాషియం, జింక్, సెలీనియం, అయోడిన్, రాగి, మాంగనీస్, సోడియం వంటి ఖనిజాలు మన ఆరోగ్యానికి అత్యవసరమైనవి. ఇవన్నీ ఎండు రొయ్యల్లో సమృద్ధిగా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఎండురొయ్యల్లో విటమిన్ బి12, పొటాషియం, మెగ్నీషియం వున్నాయి. వారానికో పక్షానికో ఎండు రొయ్యలు తింటుంటే మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎండు రొయ్యలను తినడం వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనాలలో ఒకటి బరువును తగ్గించడం. ఎండు రొయ్యలు తింటే అందులో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్ వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గి బరువు తగ్గుతారు. చిన్నరొయ్యల్లో విటమిన్లు, అయోడిన్, ప్రొటీన్లు, జింక్ పుష్కలంగా ఉంటాయి. బరువు తగ్గించుకునే ప్రయాణంలో ఉన్నవారు అదనపు పౌండ్లను తగ్గించుకోవాలని చూస్తున్న వారికి ఇవి మంచి ఎంపిక. జుట్టు కుదుళ్లు గట్టిగా వుంచడంలో ఎండు రొయ్యలు ఎంతో మేలు చేస్తాయి. రొయ్యల్లో వుండే సెలీనియం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు సూచించాయి. శరీరం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో ఎండురొయ్యలు ఎంతో మేలు చేస్తాయి. రొయ్యల్లో అయోడిన్ కూడా కావాల్సినంతగా లభిస్తుంది. ఇది కూడా థైరాయిడ్ గ్రంథి పనితీరును మెరుగుపరచడానికి దోహదపడుతుంది. ఎండు రొయ్యల్లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. ఇది కండరాలు, చర్మం, ఇతర శరీర కణాల నిర్మాణానికి, మరమ్మతుకు సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రొయ్యల్లో లభించే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, వాపును తగ్గించడంలో సహాయపడతాయి.

# ఇది నీరు కాదు అమృతం..



ప్రతి ఇంటి వంటగదిలో ఉండే జీలకర్ర కేవలం ఆహారానికి రుచిని మాత్రమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఒక చిన్న చిట్కాతో అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చు. ప్రతిరోజూ మనం ఎదుర్కొనే అజీర్తి, గ్యాస్, బరువు పెరగడం వంటి సమస్యలకు జీలకర్ర నీరు ఒక అద్భుతమైన ఔషధం. సాధారణంగా భారతీయ వంటగదిలో ఉండే జీలకర్రలో చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా జీలకర్ర నీరు తాగితే అనేక ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి చాలా మంచివి. జీర్ణవ్యవస్థను ఇది మెరుగుపరుస్తుంది. అజీర్తి, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. జీవక్రియను వేగవంతం చేసి, కొవ్వును కరిగించడంలో కూడా ఇది సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక మంచి ఎంపిక. గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా ఇది ప్రభావం చూపుతుంది. రోజువారీ జీవితంలో ఎదురయ్యే కొన్ని చిన్న ఆరోగ్య సమస్యలకు జీలకర్ర నీరు తక్షణ పరిష్కారం ఇస్తుంది. భోజనం తర్వాత ఒక గ్లాసు జీలకర్ర నీరు తాగితే అజీర్తి తగ్గుతుంది. శరీరంలో వేడి ఎక్కువగా ఉన్నవారు ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీరు తాగితే చలువ చేస్తుంది. నిద్రలేమి సమస్య ఉంటే, రాత్రి పడుకునే ముందు తాగితే మంచి నిద్ర పడుతుంది. దగ్గు, జలుబుతో బాధపడేవారు, కొద్దిగా వేడి చేసిన జీలకర్ర నీరు తాగితే చాలా మంచిది. దీనిలో ఉండే గుణాలు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మలబద్ధకం సమస్యకు కూడా ఇది ఒక మంచి పరిష్కారం. జీలకర్రలో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. కాబట్టి రోజువారీ అలవాటుగా జీలకర్ర నీరు తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం.

# టీ ఎక్కువగా తాగితే ఇంత డేంజరా?



టీలో కెఫిన్ ఉంటుందని మీకు తెలుసా..? ఇది మీకు నిద్రలేమి, ఆందోళన, విశ్రాంతి లేకపోవడం, భయానికి కారణమవుతుంది. ఇది శరీరానికి చాలా హానికరం. టీ ఎక్కువగా తాగడం వల్ల అసిడిటీ, గ్యాస్, కడుపు నొప్పి వస్తుంది. అలాగే, టీ ఎక్కువగా తాగడం వల్ల మీ జీర్ణక్రియలో చాలా సమస్యలు వస్తాయి. టీలో ఉండే టానిన్ శరీరంలో ఇనుము శోషణను తగ్గిస్తుంది. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ లోపానికి దారితీస్తుంది. టీ ఒక మూత్రవిసర్జన కారకం. అంటే ఇది శరీరం అదనపు నీటిని బయటకు పంపుతుంది. ఇది నిర్జలీకరణానికి దారితీస్తుంది. టీలో అధిక మొత్తంలో కెఫిన్ ఉంటుంది. ఇది రక్తపోటును పెంచుతుంది. అధిక రక్తపోటు గుండె జబ్బులు, స్ట్రోక్, మూత్రపిండాల వ్యాధులకు కారణమవుతుంది. మీరు ఎక్కువగా టీ తాగితే, అది నెమ్మదిగా మీ ఆరోగ్యానికి హాని కలిగించడం ప్రారంభిస్తుంది. టీలోని టానిన్లు దంతాలను దెబ్బతీస్తాయి. దీనివల్ల అవి పసుపు రంగులోకి మారుతాయి. దంతక్షయానికి దారితీస్తాయి. టీలో ఉండే ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతుందని మీకు తెలుసా. ఇది శరీరానికి చాలా హాని కలిగిస్తుంది. టీ ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని ద్రవ సమతుల్యత దెబ్బతింటుంది. ఇది ఎముకలను బలహీనపరుస్తుంది. గర్భధారణ సమయంలో అధిక కెఫిన్ వినియోగం తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదకరం. ఇది గర్భస్రావం లేదా తక్కువ బరువుతో కూడిన శిశువు జననానికి దారితీస్తుంది. టీ ఎక్కువగా తాగడం వల్ల శరీరానికి చాలా హాని కలుగుతుంది.

# "ప్రజా పాలన" దినోత్సవాన్ని వైభవంగా జరుపుకోవాలి

## నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**నకిరేకల్, 16 సెప్టెంబర్ 2025 (ధర్మఘంట):** నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన" దినోత్సవాన్ని వైభవంగా జరుపుకోవాలని సూచించారు. నేడు నకిరేకల్ పన్నాలగూడెంలోని వారి క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం రేపు "ప్రజా పాలన" దినోత్సవ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలలో "ప్రజా పాలన" దినోత్సవాన్ని వైభవంగా జరుపుకోవాలని, ఈ సందర్భంగా వారి పర్యటన వివరాలు క్రింది విధంగా ఉన్నట్లు, ఆయా మండలానికి సంబంధించిన ప్రజాప్రతినిదులు, నాయకులు సకాలంలో హాజరుకావాలని, కోరారు.

**పర్యటన సమాచారం**

ఉదయం 09:00 గంటలకు నకిరేకల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జెండాను ఆవిష్కరించనున్నారు
ఉదయం 10:00 గంటలకు నల్గొండ పట్టణంలోని పరేడ్ గ్రౌండ్ లో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు
మధ్యాహ్నం 03:00 గంటలకు చిట్యాల మండలంలోని సుంకెనపల్లి గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మాణం పనులకు శంకుస్థాపన
మధ్యాహ్నం 03:30 నిమిషాలకు చిట్యాల మండలంలోని ఏపూర్ గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మాణం పనులకు శంకుస్థాపన



సాయంత్రం 04:00 గంటలకు చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో అంగన్వాడీ భవనం హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం పనులకు శంకుస్థాపన
సాయంత్రం 04:30 నిమిషాలకు నార్కెట్‌పల్లి మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం పనులకు శంకుస్థాపన
సాయంత్రం 05:00 గంటలకు కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామం నుండి పిట్టంపల్లి వరకు %R&B% రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన


## రేపు (బుధవారం) ప్రజాపాలన దినోత్సవం




**హైదరాబాద్, 16 సెప్టెంబర్ 2025 (ధర్మఘంట):** హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ లో అధికారికంగా నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని, జాతీయ జెండాను సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఎగరవేయనున్నారు. ఈ మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఎగురవేయాలని తెలంగాణ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలలో జాతీయ జెండా ఎగరవేయనున్నారు.

# గ్రూప్ వన్ పోస్టుకు 3 కోట్లా

**హైదరాబాద్ :** గ్రూప్ 1 మెయిన్స్ పేపర్లు రీవాల్యుయేషన్ చేయాలని, లేనిపక్షంలో ఎగ్జామ్ మళ్లీ నిర్వహించాలని తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల తీర్పు వెలువరించింది. అయితే రూ.3 కోట్లు ఇచ్చి గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించారని, ఇది రూ.1700 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపణలు రావడంతో ర్యాంకర్ల తల్లిదండ్రులు సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారుఓ ర్యాంకర్ తల్లి మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఏడుగురు బిడ్డలు, ఓ బాబు ఉన్నారని.. కూలీనాలి చేసుకుని వాళ్లను ప్రయోజకులు చేశానన్నారు. కొందరు పిల్లల్ని పనికి పంపించి ఒకర్ని చదివిపించి ఉద్యోగం వచ్చేందుకు కష్టపడ్డాం. పాల ప్యాకెట్‌కు పైసలు లేవంటే మీరు రూ.3 కోట్లు ఇచ్చారంటున్నారు. ఎక్కడి నుంచి తెస్తాం సార్. రూ.200, రూ.500తో పూట గడవడమే కష్టంగా ఉంది. ఒక్కడు బాగుపడితే కుటుంబాన్ని చూసుకుంటాడని ఆశలు పెట్టుకుంటే డబ్బులు ఇచ్చారని చెప్పడం సరికాదు. ఇప్పటికే రెండుసార్లు పరీక్షలు రద్దు చేశారు. మూడోసారి పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తారా ? వాళ్ల ఏజ్ అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రూప్ 157 ర్యాంకర్ ఉదయ్ కిరణ్ తల్లి లలిత మీడియాతో మాట్లాడుతూ.. మారుమూల పల్లె నుంచి వచ్చిన వాళ్లం. అతికష్టమ్మీద పిల్లలను తెలుగు మీడియం నుంచి ఇంగ్లీష్ మీడియం చదువులు చెప్పించాం. గత మూడేళ్లుగా దసరా పండుగలకు మా అబ్బాయి ఇంటికి కూడా రాకుండా ప్రిపేర్ అయ్యాడు. కోచింగ్ సెంటర్లో ఉండి ఎంతో పట్టుదలతో చదివి గ్రూప్ 1 ర్యాంక్ సాధించాడు. గతంలో పరీక్షలు నిర్వహించి రద్దు చేసినా, మానసికంగా సిద్ధమై మళ్లీ ఉద్యోగం సాధించాడు. ప్రతిసారి జాబ్స్ ఫలితాలపై దుష్ప్రచారం జరుగుతోంది. ప్రిలిమ్స్, మెయిన్స్ ఫలితాల తరువాత సైలెంట్ గా ఉన్న వాళ్లు ఇప్పుడు గ్రూప్ 1 పోస్టులకు ఎంపికైన తరువాత అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆరోపణలు చేస్తున్నారు.




కష్టపడి చదివించారు. ఈ బాబును చూసి నేర్చుకోవాలి అని స్థానికంగా చెబుతుంటారు. జాబ్ తెచ్చుకుని కుర్చీలో కూర్చోక ముందే ఉద్యోగాన్ని లాగేసుకుంటున్నారు. మళ్లీ పరీక్సలు నిర్వహించడం అంటే కింద పడిన అన్నాన్ని మళ్లీ తీసుకుని తినడమే. మళ్లీ ఎగ్జామ్ రాస్తే ఎంపికైనా అది కరెక్ట్ అన్న నమ్మకం ఎవరికైనా ఉంటుందా. రూ.3 కోట్లు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. కనీసం రూ.30 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నవాళ్లు, అంత డబ్బు చూసిన వాళ్లు ఇక్కడ లేరు. ర్యాంక్ తెచ్చుకుని మా బాబు రోడ్డున పడినట్లుగా పరిస్థితి ఉంది. మరో ర్యాంకర్ తల్లి మాట్లాడుతూ.. ఫలితాలు వచ్చి జాబ్ ఎక్కకముందే గ్రూప్ 1 ర్యాంకర్లపై అసత్యాలు ప్రచారం చేయడం సరికాదు. కోచింగ్ లేకుండా బుక్స్ చదివి జాబ్ తెచ్చుకున్న వారిని డబ్బులతో జాబ్ కొన్నారని ఆరోపించడం ఎంతవరకు సమంజసం. ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించి తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. కోదాడ పక్కన పల్లెటూరు నుంచి ర్యాంకర్ తల్లి సీత కన్నీళు పెట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పంపి పిల్లల్ని చదివించాను. నా కూతురు కష్టపడి చదివి జాబ్ తెచ్చుకుంటే రూ.3 కోట్లు ఆరోపణలతో జీవితాలు నాశనం చేస్తున్నారు. మాకు ఎవరూ పెద్దలు తెలవదు, రికమండేషన్లు చేయలేం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలని కోరారు. మరో ర్యాంకర్ తల్లి మాట్లాడుతూ.. కష్టపడి గ్రూప్ 1 ర్యాంక్ తెచ్చుకుంటే అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. చదువుకున్న రాజకీయ నాయకులు కూడా చదువుకోని వాళ్లలాగ మాట్లాడుతున్నారు. పిల్లల భవిష్యత్ ఏమవుతుందని తల్లిదండ్రులు ఎంతో ఆందోళన చెందుతున్నారు. జాబ్ సాధించిన వాళ్లను తప్పు చేసినవాళ్లుగా చిత్రీకరిస్తున్నారు.

## ఒంటరి పోరాటం

**వరంగల్ :** మహబూబాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మేడలో బంగారు గొలుసును కొట్టేసేందుకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దారుణానికి ఒడిగట్టారు. దొంగలతో ప్రతిఘటించిన వృద్ధురాలిని కొట్టి బావిలో పడేశారు. ప్రాణాలు వదిలినా ఆ వృద్ధురాలు తన చేతిలోని బంగారాన్ని మాత్రం వదలలేదు. స్థానికుల సమాచారంతో ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో జరిగింది. రాధమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా జీవనం కొనసాగిస్తోంది. రాధమ్మకు ముగ్గరు కుమారులు వారిలో ఇద్దరు మహబూబాబాద్ లో నివశిస్తున్నారు.. మరొక కుమారుడు సూరత్ లో స్థిరపడ్డారు. భర్త కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందాడు. దీంతో వృద్ధురాలు ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అయితే ఆమె మెడలో ఉన్న బంగారంపై కన్నేసిన కొందరు దుండగులు కాజేసేందుకు ప్లాన్ చేశారు. రాత్రి సమయంలో రాధమ్మ ఒంటరిగా ఉంటుందని గమనించిన దుండగులు చోరీకి వచ్చారు.దొంగలను గమనించిన రాధమ్మ వారితో చాలా సేపు ప్రతిఘటించింది. తీవ్ర గాయాలతో ప్రాణం పోతున్న తన మేడలోని గొలుసును మాత్రం దుండగుల చేతికి చిక్కనియ్యలేదు.. వాళ్లను ముప్పుతిప్పలు పెట్టింది. ఇక ఇలా అయితే కుదరదని భావించిన దుండగులు రాధమ్మపై తీవ్రంగా దాడి చేసి ఆమెను హత్య చేశారు. ఆ తర్వాత ఆమె కాళ్ళ పట్టీలు, చేతి వెండి కడియం, 3 తులాల బంగారు ఆభరణాలు కాజేశారు. ఆ తర్వాత రాధమ్మ మృతదేహాన్ని సమీపంలోని బావిలో పడేసి అక్కడి నుండి గుట్టు చప్పుడు కాకుండా పారిపోయారు.అయితే ఉదయం రక్తపు మరకల ఆధారంగా చేద బావిలో రాధమ్మ మృతదేహాన్ని గుర్తించారు స్థానికులు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రాధమ్మ మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే దుండగులతో తీవ్రంగా పోరాడిన రాధమ్మ తన గొలుసును మాత్రం వదలలేదు. మృతదేహం వెలికి తీసినప్పుడు ఆమెచేతిలో గొలుసు అలానే ఉంది. ఇక ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రూ.3 కోట్లు ఇచ్చి జాబ్ తెచ్చుకున్నామా

**హైదరాబాద్ :** అప్పులు చేసి, తిండి తిప్పలు లేకుండా ఎంతో శ్రమించి పిల్లలను పోటీ పరీక్షలకు సిద్ధం చేసిన తమపై ఆరోపణలు చేయడం సరికాదని గ్రూప్ 1 విజేత తల్లిదండ్రులు సూచించారు. పిల్లలకు పెళ్లిళ్లు ఎప్పుడు చేస్తారు, వాళ్లు ఇంకా జాబ్ తెచ్చేకోలేదా, వాళ్లకు జాబ్ రాదా అని చుట్టుపక్కల వాళ్ల నుంచి సూటిపోటి మాటలు అవమానాలు ఎదుర్కొంటున్న పరిస్థితి మాది. కానీ ఇలాంటి తల్లిదండ్రులు నిజంగానే రూ.3 కోట్లు ఇచ్చి గ్రూప్ 1 ఉద్యోగాలు కొనుక్కున్నారా అని నిరూపించాలని డిమాండ్ చేశారు. తాము సైలెంట్ గా ఉంటే నిజంగానే ఉద్యోగాలు కొన్నారని ప్రచారం చేస్తారని మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో టీజీపీఎస్సీ గ్రూప్ 1 విజేతలుగా నిలిచిన ఓ విద్యార్థిని తండ్రి దాదా సలాం (గోదావరిఖని) మాట్లాడారు. ఒక్కసారి కోర్టుకు విషయం వెళ్తే దాని మీద మనం మాట్లాడటానికి వీలులేదు. న్యాయపరంగా పోరాటం చేయాలి. ఇప్పుడు సెలక్ట్ అయిన

# విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందించాలి





**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

**జగిత్యాల :** విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు.పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సంధర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందని ప్రస్తుతం ప్రతి రోజు అందించే మెనూ ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.డైట్ మెనూ ను పక్కాగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు..చదువుల్లో వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాస్ లు తీసుకోవాలని సూచించారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ,అత్యదిక నిధులు మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.మైనార్టీ గురుకుల పాఠశాలను అనేక సార్లు సందర్శించడం జరిగిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాస్మొటిక్,డైట్ చార్జీలు 40 శాతం పెంచడం జరిగిందని తెలిపారు.గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ లు 100 శాతం పూర్తి అయ్యేవిదంగా అధ్యాపకులు చొరవ తీసుకోవాలని తెలిపారు.పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి వచ్చే ప్రయత్నం చేస్తానని చెప్పారు.పాఠశాలలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం, ముఖ్యమంతి,మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.చల్గల్ లో 200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్ మంజూరు చేయటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం,అడువల జ్యోతి లక్ష్మణ్,మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజా హిద్, మాజీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుమాల రాజ్ కుమార్,ఇంచార్జీ ప్రిన్సిపాల్ రవి, ముకీమ్, నాజీమ్,పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## బిజినెస్

### 26 శాతం క్షీణించిన వాణిజ్య లోటు



దేశ ఎగుమతులు వరుసగా రెండో నెలా పుంజుకున్నాయి. సోమవారం ప్రభుత్వ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఆగష్టులో దేశ ఎగుమతులు 6.7 శాతం పెరిగి 35.1 బిలియన్ డాలర్ల(రూ. 3.09 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. అంతకుముందు జూలై నెలలో ఇవి 37.24 బిలియన్ డాలర్లు(రూ. 3.28 లక్షల కోట్లు) గా ఉన్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. దిగుమతులు 10.1 శాతం తగ్గి 61.6 బిలియన్ డాలర్ల(రూ. 5.43 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. దీంతో ఆగస్టులో భారత వాణిజ్య లోటు 26.5 బిలియన్ డాలర్లు(రూ. 2.34 లక్షల కోట్లు)గా ఉందని, అంతకుముందు నెలలో ఇది 27.35 బిలియన్ డాలర్లు(రూ. 2.41 లక్షల కోట్లు)గా నమోదైంది. గతేడాది ఆగష్టులో నమోదైన వాణిజ్య లోటు 35.64 బిలియన్ డాలర్ల(రూ. 3.14 లక్షల కోట్ల)తో పోలిస్తే ఈసారి 25.7 శాతం క్షీణించింది. భౌగోళిక రాజకీయ పరిణామాలు, ప్రపంచ వాణిజ్యంలో నెలకొన్న పాలసీ సవాళ్ల మధ్య భారత ఎగుమతులు మెరుగ్గా రాణించాయని వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అన్నారు.

### ఇకపై ఉబర్‌లో హెలికాప్టర్ బుకింగ్స్..!
### వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే చాన్స్




ప్రముఖ దిగ్గజ టాక్సీ సేవలందించే యాప్ ఉబర్ లో కొత్త సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు కారు, బైక్, ఆటో మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉండేది.వీటితో పాటు యాప్‌లో హెలికాప్టర్ బుకింగ్స్ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. గతంలో ఈ సర్వీస్ కేవలం ఇటలీలో మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం అత్యధిక జనాభా కలిగిన నగరాల్లో హెలికాప్టర్ రైడ్ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఉబర్‌లో కస్టమర్లకు హెలికాప్టర్ రైడ్‌లను అందించాలని యోచిస్తున్నామని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన కంపెనీ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. దీని కోసం, ఉబర్ ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీల తయారీ సంస్థ జాబీ ఏవియేషన్‌తో జతకట్టి వచ్చే ఏడాది (2026)లో సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది. జోబీ బ్లేడ్ ఎయిర్ మొబిలిటీని %వి%125 మిలియన్ల ఒప్పందంలో భాగంగా ఈ విషయం చోటుచేసుకుంది. ఈ అంశంపై జాబీ వ్యవస్థాపకుడు, సీఈఓ అయిన జోబెన్ బెవిర్ట్ మాట్లాడుతూ.. ఉబర్ కస్టమర్లకు విమాన ప్రయాణాన్ని పరిచయం చేయడానికి తాము ఉత్సాహంగా ఉన్నామని వెల్లడించారు. జోబీ ప్రతినిధి సీబీఎస్ మనీవాచ్‌తో మాట్లాడుతూ.. రూట్లు, ధరల గురించి కంపెనీ ఇంకా ఖరారు చేయలేదని, అయితే విమానాశ్రయ కనెక్షన్లు వినియోగదారులకు ఆకర్షణీయంగా ఉంటాయని తెలిపారు.

# నట్టేట ముంచేస్తున్న 'స్టార్ హెల్త్'..
# తీవ్ర ఆందోళనలో పాలసీదారులు

వైద్య ఖర్చులు పెరుగుతున్న ఈ రోజుల్లో ప్రజలు క్యాష్‌లెస్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. అత్యవసర సమయంలో ముందుగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీ నేరుగా హాస్పిటల్ బిల్లులు భరించే అవకాశం ఉండటంతో పాలసీదారులు ఆర్థిక భారం నుంచి తప్పించుకునే అవకాశం ఉందని భావించి వేలాది రూపాయలు చెల్లించి ఈ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారు.నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో తక్షణ చికిత్స పొందే సౌకర్యం, పేపర్‌వర్క్ తగ్గింపు, అనుకోని ఖర్చుల భయం లేకపోవడం, కుటుంబ ఆర్థిక స్థితి కాపాడుకోవడం వంటి కారణాల వల్లే వీటి డిమాండ్ రోజురోజుకీ పెరుగుతోంది. అయితే, ఇలాంటి వారి అవకాశాన్ని సొమ్ము చేసుకుంటున్న స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్.. పాలసీదారులకు మాత్రం సేవలు అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతోంది. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీదారులు క్లెయిం చేసుకునే సమయంలో చికిత్సల ధరలను తగ్గించాలంటూ ఒత్తిడి చేయడం, డాక్టర్ల క్లినికల్ నిర్ణయాలపై అసంబద్ధమైన ప్రశ్నలతో పాటు నగదు రహిత క్లెయింలకు ఆమోదం తెలిపి తుది బిల్లులో అడ్డమైన కోతలు విధించడం వంటి చర్యలతో పాటు నగదు రహిత చికిత్సలను అకస్మాత్తుగా ఉపసంహరించుకోవడం చేస్తున్నట్లు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దీంతో క్యాష్ లెస్ చికిత్స




కోసం స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్న పాలసీదారులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ తీరు ఆది నుంచి ఇలాగే ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టార్ హెల్త్ వ్యవహారంపై అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఇండియా (ఏ.హెచ్.పీ.ఐ) ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. . ఈ సంస్థను నమ్మి హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్న అనేకమంది పాలసీదారులను మోసం చేస్తోందని ఏ.హెచ్.పీ.ఐ ఆరోపించింది. దీంతో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ విధానాలపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వైద్యవర్గాలు కోరుతున్నాయి. అనేక మంది పాలసీదారులు సైతం ఈ సంస్థ తీరుపై ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే స్టార్ ప్రతినిధులకు ఫోన్ చేసి తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. వెంటనే వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. అక్రమ పద్ధతులను అవలంబిస్తోందని ఆరోపిస్తూ.. సంస్థకు సంబంధించిన క్యాష్ లెస్ సేవలను అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఇండియా (ఏ.హెచ్.పీ.ఐ) రద్దు చేసే అవకాశం ఉంది. ఇదే విషయంపై ఆసుపత్రుల సంఘం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. 15,000కు పైగా ఆసుపత్రులకు ప్రాతినిధ్యం వహించే ఏ.హెచ్.పీ.ఐ.. స్టార్ హెల్త్ సంస్థతో సెప్టెంబర్ 22లోగా ఒక ఒప్పందం కుదరకపోతే, ఆ రోజు నుంచి పూర్తిగా స్టార్ హెల్త్ పాలసీదారులకు క్యాష్ లెస్ సేవలను నిలిపివేస్తామని స్పష్టం చేసింది. గతంలో, బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలు కూడా ఏ.హెచ్.పీ.ఐతో ఇలాంటి సమస్యలను ఎదుర్కొన్నాయి. అయితే చర్చల ద్వారా ఆ సమస్యలను పరిష్కరించుకున్నాయి. కానీ స్టార్ హెల్త్ తీరు మాత్రం సక్రమంగా లేదని ఏ.హెచ్.పీ.ఐ భావిస్తోంది. రోగులకు సరైన సేవలు అందించేందుకు ఆసుపత్రులు తమ వంతు ప్రయత్నం చేస్తూనే ఉంటాయని... కానీ స్టార్ హెల్త్ లాంటి సంస్థల తీరు వల్ల రోగులు, ఆసుపత్రులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతోందని ఏ.హెచ్.పీ.ఐ చెబుతోంది.

### స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్లలో ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న లాభాలకు సోమవారం బ్రేక్ పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటంతో ప్రధాన సూచీలు స్వల్ప నష్టాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. అయితే, జీఎస్టీ సంస్కరణల కారణంగా దేశీయ వినియోగం బలంగా ఉండటంతో మార్కెట్లు పెద్దగా పడిపోకుండా నిలదొక్కుకున్నాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 118.96 పాయింట్లు నష్టపోయి 81,785.74 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 44.80 పాయింట్ల నష్టంతో 25,069.20 వద్ద ముగిసింది. యూఎస్ ఫెడ్ సమావేశంపై అనిశ్చితి, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ ఈ నష్టాలకు ప్రధాన కారణాలుగా మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. అయితే, దేశీయంగా బలమైన వినియోగం, వాణిజ్య ఒప్పందాలపై ఆశలు, రాబోయే ఆర్థిక సంవత్సరంలో కంపెనీల ఆదాయాలు మెరుగుపడతాయన్న అంచనాలు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా వంటి షేర్లు నష్టాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్ టీ వంటివి స్వల్ప లాభాలను నమోదు చేశాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో సూచీలు నష్టపోయాయి. మరోవైపు, నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫిన్ సర్వీసెస్ స్వల్ప లాభాలతో ముగిశాయి. ప్రధాన సూచీలు ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు లాభపడ్డాయి. మార్కెట్ పడిపోయినప్పుడు కొనుగోలు చేయడం మంచి వ్యూహమని నిపుణులు సూచిస్తున్నారు.

### పబ్లిక్ ఇష్యూ యోచనలో మెడికవర్ హాస్పిటల్

వచ్చే ఏడాది తమ సంస్థను ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు తెచ్చే యోచనలో ఉన్నామని మెడికవర్ హాస్పిటల్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అనిల్ కృష్ణ వెల్లడించారు. సంస్థ వ్యాల్యూయేషన్ ఒక బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8800) ఉండొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిల్ కృష్ణ మాట్లాడుతూ.. సంస్థ విస్తరణ ప్రణాళికలను ప్రకటించారు. ప్రస్తుతం తమకు 23 హాస్పిటల్స్ ఉన్నాయని.. మంగళవారం సికింద్రాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించడం ద్వారా 24కు చేరనున్నాయని వెల్లడించారు. దీన్ని 100 కోట్ల పెట్టుబడితో.. 300 పడకలతో అందుబాలోకి తెచ్చామన్నారు. దీంతో మొత్తం పడకలు 5800కి చేరనున్నాయని చెప్పారు. త్వరలోనే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ కోకాపేటలో మరో హాస్పిటల్ అందుబాటులోకి రానుందన్నారు. తమ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో కార్యకలాపాలను కలిగి ఉందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.1850 కోట్ల టర్నోవర్ నమోదు చేశామని చెప్పారు.

## స్పోర్ట్స్

# మరోసారి అగ్రపీఠాన్ని అధిరోహించిన టీమిండియా స్టార్ ప్లేయర్




భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధన ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరింది. గత వారం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉండిన మంధన.. తాజాగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో రాణించి (58 బంతుల్లో 63బీ 6 ఫోర్లు, 2 సిక్సర్లు) 7 అదనపు రేటింగ్ పాయింట్లను సాధించింది. తద్వారా తన పాయింట్ల సంఖ్యను 735కు పెంచుకుని టాప్ ర్యాంక్‌కు చేరింది. ఈ క్రమంలో ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్‌ను కిందకు దించి, కెరీర్‌లో నాలుగో సారి అగ్రపీఠాన్ని అధిరోహించింది. 2019లో తొలిసారి టాప్ ర్యాంక్‌ను కైవసం చేసుకున్న మంధన.. ఈ ఏడాది జూన్, జులైల్లో కూడా స్వల్ప కాలం నంబర్ వన్ వన్డే బ్యాటర్‌గా కొనసాగింది. ప్రస్తుతం మంధనకు రెండో స్థానంలో ఉన్న బ్రంట్‌కు కేవలం నాలుగు రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం మాత్రమే ఉంది. ఈ వారం ఆసీస్‌తో జరుగబోయే మరో రెండు వన్డేల్లో మంధన ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే.. రేటింగ్ పాయింట్లను మరింత మెరుగుపర్చుకుని అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకునే అవకాశం ఉంది. మంధన కీలక సమయంలో నంబర్ వన్ స్థానానికి ఎగబాకింది. ఈ నెలాఖరు నుంచి (సెప్టెంబర్ 30) భారత్, శ్రీలంకల్లో వన్డే ప్రపంచకప్ ప్రారంభం కానుంది. ఇలాంటి తరుణంలో నంబర్ వన్ స్థానానికి ఎగబాకడం ఆమెకు మానసిక స్థైర్యాన్ని ఇస్తుంది. తాజా ర్యాంకింగ్స్‌లో మంధనతో పాటు మరో ఇద్దరు భారత బ్యాటర్లు కూడా లబ్ది పొందారు. ప్రతీక రావల్ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకుని 42వ స్థానానికి.. హర్లీన్ డియోల్ 5 స్థానాలు మెరుగుపర్చుకుని 43వ స్థానానికి ఎగబాకారు. మిగతా భారత బ్యాటర్లలో హర్మన్‌ప్రీత్ 12వ స్థానంలో.. జెమీమా రోడ్రిగ్రెజ్ 15 స్థానంలో, దీప్తి శర్మ 24వ స్థానంలో, రిచా ఘోష్ 37 స్థానంలో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఇంగ్లండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. భారత స్పిన్నర్ స్నేహ్ రాణా ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని 16వ స్థానానికి ఎగబాకింది. మరో భారత బౌలర్ దీప్తి శర్మ 3 స్థానాలు దిగజారి 7వ ర్యాంక్‌ను పడిపోయింది. మిగతా భారత బౌలర్లలో రేణక సింగ్ ఠాకూర్ 26, క్రాంతి గౌడ్ 62, అరుంధతి రెడ్డి 65, పూజా వస్త్రాకర్ 77, శ్రీ చరణి 83, ప్రియా మిశ్రా 85, టైటాస్ సాధు 91, సైమా ఠాకోర్ 96 స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విషయానికొస్తే.. ఆస్ట్రేలియాకు చెందిన యాష్ గార్డ్‌నర్ టాప్ ప్లేస్‌ను నిలబెట్టుకోగా.. హేలీ మాథ్యూస్, మారిజన్ కాప్ టాప్-3లో ఉన్నారు. భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 4వ స్థానంలో ఉంది.

### భారత గడ్డపై తొలి మ్యాచ్‌లోనే శతక్కొట్టిన ఆస్ట్రేలియా యువ సంచలనం?




ఆస్ట్రేలియా యువ సంచలనం సామ్ కొన్‌స్టాస్ భారత గడ్డపై తన తొలి మ్యాచ్‌లోనే మెరుపు సెంచరీతో కదంతొక్కాడు. 19 ఏళ్ల ఈ ఆసీస్ యువ ఓపెనర్ ప్రస్తుతం ఆస్ట్రేలియా-ఏ జట్టులో భాగంగా భారత్‌లో పర్యటిస్తున్నాడు. లక్నోలోని ఎకానా స్టేడియంలో భారత-ఏ జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో 122 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. తనుశ్ కోటియన్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది మూడంకెల మార్కును తాకాడు. మొత్తంగా 126 బంతులు ఎదుర్కొని 10 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 101 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. కొన్‌స్టాస్‌కు జతగా మరో ఓపెనర్ క్యాంప్‌బెల్ కెల్లావే (88) కూడా సెంచరీని సమీపించాడు. కెల్లావే 73 పరుగుల వద్ద ఉండగా.. 56 పరుగుల వద్ద ఉండిన కొన్‌స్టాస్ వేగంగా సెంచరీ పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా-ఏ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేస్తుంది. తొలి రోజు టీ విరామం సమయానికి ఆసీస్-ఏ స్కోర్ 198/0గా ఉంది. భారత బౌలర్లు 37 ఓవర్ల పాటు బౌలింగ్ చేసినా ఒక్క వికెట్‌ను కూడా పడగొట్టలేకపోయారు. టీమిండియాకు ఆడిన అనుభవం ఉన్న బౌలర్లు ప్రసిద్ధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్ కూడా ఈ మ్యాచ్‌లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. తనుశ్ కోటియన్, హర్ష్ దూబే భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ ఒక్కడే ఆసీస్-ఏ ఓపెనర్లను కాస్త నిలువరించగలిగాడు. ఈ మ్యాచ్‌లో ఆసీస్-ఏ జట్టుకు నాథన్ మెక్‌స్వీని కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా.. కొన్‌స్టాస్, జోష్ ఫిలిప్, కూపర్ కన్నోలీ, జేవియర్ బార్ట్‌లెట్, టాడ్ మర్ఫీ లాంటి గుర్తించదగ్గ ఆటగాళ్లు తుది జట్టులో ఉన్నారు. భారత-ఏ జట్టు విషయానికొస్తే.. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ వ్యవహరిస్తున్నాడు. అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్, ఎన్ జగదీషన్, దేవ్‌దత్ పడిక్కల్, ధృవ్ జురెల్, తనుశ్ కోటియన్, హర్ష్ దూబే, ప్రసిద్ధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, గుర్నూర్ బ్రార్ తుది జట్టులో ఉన్నారు. ఆస్ట్రేలియా-ఏ జట్టు రెండు అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లు (నాలుగు రోజుల మ్యాచ్‌లు), మూడు అనధికారిక వన్డేల కోసం భారత్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ఇవాళే? తొలి టెస్ట్ మొదలైంది. రెండో టెస్ట్ కూడా ఎకానా స్టేడియంలోనే సెప్టెంబర్ 23-26 మధ్యలో జరుగతుంది. ఆతర్వాత సెప్టెంబర్ 30, అక్టోబర్ 3, 5 తేదీల్లో కాన్పూర్‌లో వన్డేలు జరుగుతాయి. ఈ సిరీస్‌ల కోసం భారత-ఏ జట్లను ఇదివరకే ప్రకటించారు.

### ఆనవాయితీకి మంగళం.. ఈసారి జనవరిలోనే డబ్ల్యూపీఎల్ సందడి..?




మహిళా క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించిన మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ రాబోతోంది. వచ్చే ఏడాది ఆరంభంలో ఈ మెగా టోర్నీ జరుగనుంది. జనవరి మొదటి వారంలో డబ్ల్యూపీఎల్ సందడి మొదలవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. జనవరి 6 మంగళవారం లేదంటే 8వ తేదీ గురువారంజ.. ఈ రెండింటిలో ఒక తేదీన నాలుగో సీజన్ షురూ కానుందని సమాచారం. అయితే.. గత మూడు పర్యాయాలు ఫిబ్రవరి %-% మార్చి మధ్యలో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. మరి ఇప్పుడు ఉన్నట్టుండి ఆనవాయితీకి మంగళం పాడడానికి ఓ కారణముంది. అదేంటంటే.. గత మూడు సీజన్లుగా మహిళల ప్రీమియర్ లీగ్ అభిమానులను అలరిస్తూ వస్తోంది. దాంతో, నాలుగో సీజన్ కోసం ఫ్యాన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే.. వచ్చే ఏడాది వేసవిలో టీ20 ప్రపంచ కప్ పోటీలకు భారత్ ఆతిథ్యమిస్తోంది. సో.. ప్రపంచ కప్ మ్యాచ్‌లతో క్లాష్ లేకుండా చూడాలని డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపారు నిర్వాహకులు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి ప్రపంచ కప్ మార్చిలో మొదలవ్వనుంది.

**కొత్త ఛాంపియన్‌ను చూస్తామా..!**

డబ్ల్యూపీఎల్ ఆరంభం సీజన్ నుంచి ఐదు జట్లు మాత్రమే పోటీపడుతున్నాయి. ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్.. ఈ ఫ్రాంచైజీలే ఈసారి కూడా టైటిల్ కోసం పోటీపడనున్నాయి. మరో విషయం ఏంటంటే.. నాలుగో సీజన్ ఆరంభానికి ముందు నవంబర్‌లో వేలం పూర్తి చేసేందుకు సన్నాహకాలు చేస్తున్నారు నిర్వాహకులు. గత సీజన్ విజేత ఆర్సీబీ డిఫెండింగ్ ఛాంపియన్‌గా టోర్నమెంట్ బరిలోకి దిగనుంది. తొలి రెండు సీజన్లలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. దాంతో.. నాలుగో సీజన్‌లో కొత్త విజేతగా కప్‌ను ముద్దాడేందుకు ఢిల్లీ, యూపీ, గుజరాత్ జట్లు పక్కా ప్రణాళికలు రచిస్తున్నాయి.

# పెద్ది 'రామ్ చరణ్' తల్లిగా సీనియర్ నటి



రామ్ చరణ్ పెద్ది సినిమా షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ మూవీగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. రీసెంట్‌గా బెంగళూరులో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఇప్పుడు హైదరాబాద్‌లోనే చిత్రీకరణ జరుగుతుంది. అయితే, ఈ మూవలో రామ్ చరణ్ తల్లి పాత్రలో సీనియర్ నటి ఎంపిక అయ్యారని తెలుస్తోంది. ఈ మేరకు సోషల్‌మీడియాలో భారీగానే వార్తలు వస్తున్నాయి. దాదాపు ఆమె పేరు ఫైనల్ అయిందని త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారని సమాచారం. పెద్దిలో పవర్‌ఫుల్ పాత్రలో రామ్ చరణ్ నటిస్తున్నారు. అంతే రేంజ్‌లో ఆయన తల్లి పాత్ర కూడా ఉండనుందట. అందుకే ఈ సినిమా కోసం సీనియర్ నటి విజి చంద్రశేఖర్‌ను తీసుకున్నారట. ఆమె ఇప్పటికే అఖండ సినిమాలో బాలకృష్ణకు తల్లిగా నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ఎక్కువగా తమిళ, కన్నడ సినిమాలు, సీరియల్స్‌లలో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 1981లో రజనీకాంత్ సినిమాతో పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆమె విజయవాడలో జన్మించినప్పటికీ చెన్నైలో పెరిగారు. సీనియర్ నటి సరితకు విజి చంద్రశేఖర్ సోదరి అనే విషయం తెలిసిందే. మరో చరిత్ర, ఇది కథ కాదు, కోకిల వంటి చిత్రాలతో హీరోయిన్‌గా సరిత నటించారు. ఇప్పుడు పెద్ది సినిమాలో రామ్ చరణ్‌కు తల్లి పాత్రలో విజి చంద్రశేఖర్ నటిస్తుందని టాక్ రావడంతో సరైన ఎంపిక అంటూ ఫ్యాన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు. పెద్ది సినిమా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది. ఇందులో రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. కన్నడ నటుడు శివరాజ్ కుమార్‌తోపాటు, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ మూవీని నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి.

# కర్ణాటకలో సినిమా టికెట్ ధరల వివాదం.. కోర్టుకెక్కిన 'కాంతర' నిర్మాతలు

సినిమా టికెట్ ధరల విషయంలో కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై 'కాంతార'(హొంబలే ఫిలింస్) సినిమా నిర్మాతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సినిమా టికెట్ ధరలపై పరిమితిని విధిస్తూ.. కర్ణాటక ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇకపై రాష్ట్రంలోని అన్ని థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో సినిమా టికెట్ ధర గరిష్ఠంగా రూ.200గా మాత్రమే ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి రానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై 'కాంతార' సినిమా నిర్మాతలు కోర్టుకెక్కినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన కొత్త నిబంధనల వలన పెద్ద బడ్జెట్ సినిమాలతో పాటు, మల్టీప్లెక్స్‌లలో అధిక ధరలు ఉండే సినిమాలను విడుదల చేయడం కష్టమవుతుందని దానివల్ల ఆదాయం తగ్గి మొత్తం సినీ పరిశ్రమపై చెడు ప్రభావం పడుతుందని హొంబలే ఫిల్మ్స్ వాదిస్తోంది. ఈ నిర్ణయం వల్ల సినిమా బాగా నడుస్తున్నప్పటికీ, భారీ చిత్రాలను నిర్మించడం లాభదాయకంగా ఉండదని ఆ సంస్థ పేర్కొంది. అయితే ఈ కేసుపై విచారణ సెప్టెంబర్ 16న కర్ణాటక హైకోర్టులో జరగనుంది. కాగా.. కోర్టు తీర్పు ఈ వివాదాన్ని ఏ మలుపు తిప్పుతుందో వేచి చూడాలి. మరోవైపు కాంతార చాప్టర్ 1 చిత్రం మరికొన్ని రోజుల్లో విడుదల కాబోతుంది. దాదాపు రూ.400 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమాను ఇప్పుడు విడుదల చేస్తే.. తక్కువ టికెట్ ధరలతో సినిమాకు ఆశించిన స్థాయిలో కలెక్షన్లు రావని చిత్రబృందం భావిస్తుంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి కొన్ని వర్గాలు స్వాగతించగా, మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వంటి వర్గాలు తమ ఆదాయంపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



# 'కిష్కింధపురి'పై చిరంజీవి ప్రశంసలు.. హారర్‌తో పాటు మంచి సందేశం ఉందన్న చిరు

యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి' ఈ సినిమాకు కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించింది. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాను చూసిన అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి సినిమాపై ప్రశంసలు కురిపించాడు. మన శంకర వరప్రసాద్ గారు చిత్ర నిర్మాత సాహు గారపాటి నిర్మాణంలో వచ్చిన మరో చిత్రం కిష్కింధపురి. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా చూసిన నాకు చిత్రయూనిట్ అంతా కలిసి మంచి ప్రయత్నం చేశారు అనిపించింది. ఈ చిత్రం ఇంతటి విజయం సాధించినందుకు చిత్రబృందానికి నా శుభాకాంక్షలు. సాధారణంగా హారర్ సినిమాలంటే భయంని ఎలివెట్ చేస్తూ.. దెయ్యం కథ చెప్పడం జరుగుతుంది. కానీ కిష్కింధపురిలో హారర్‌తో పాటు మంచి సైకాలాజికల్ పాయింట్‌ని జత చేసి చెప్పడం చాలా బాగుంది. శారీకర వైకల్యం కంటే మానసిక వైకల్యం చాలా ప్రమాదకరమని మేకర్స్ చక్కని సందేశం ఇచ్చారు. ఈ సినిమాను ఇంత బాగా తెరకెక్కించిన దర్శకుడు కౌశిక్‌ని అభినందిచక తప్పదు. ఈ చిత్రం ద్వారా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే అనుపమ కూడా మంచి విజయాన్ని అందుకుంది. సంగీత దర్శకుడు చైతన్య మంచి పనితనం చూపించాడు. మొత్తంగా ప్రేక్షకులకు మంచి సినిమాను అందించిన నిర్మాత సాహు గారపాటికి కృతజ్ఞతలు.. ప్రస్తుతం థియేటర్‌లో ఆడుతున్న ఈ సినిమాను మీరు మిస్ అవ్వకండంటూ చిరు చెప్పుకోచ్చాడు.






# మోహన్‌లాల్ 'వృషభ' ఫస్ట్ లుక్ విడుదల.. టీజర్ వచ్చేది అప్పుడే

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'వృషభ'. ఈ సినిమాకు నంద కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్. వ్యాస్ స్టూడియోస్, ఆశీర్వాద్ సినిమాస్ సమర్పిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియాగా రాబోతున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయడంతో పాటు టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను సెప్టెంబర్ 18న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సినిమా కథ పురాణాల నేపథ్యంలో, తండ్రీకొడుకుల మధ్య సాగే భావోద్వేగపూరిత పోరాటంగా ఉండబోతుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్ యోధుడి పాత్రలో కనిపించనున్నారు. నంద కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, మలయాళ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్నారు.

# రెబల్ స్టార్ రాజాసాబ్... మిరాయ్‌ని మరిపిస్తాడా?

ఓ వైపు పెద్ద పెద్ద హీరోల భారీ బడ్జెట్, భారీ తారాగణంతో వస్తున్న చిత్రాలు ఊరించి ఊరించి ఉస్సురుమనిపిస్తున్నాయి. మరోవైపు ప్రేక్షకుల్లో పెద్దగా ఫాలోయింగ్ లేని స్టార్స్ సినిమాలు బాక్సాఫీస్‌ను షేక్ చేసేస్తున్నాయి. అది మరీ వింత కాకపోయినా ఈ మధ్య తరచుగా జరుగుతుండడమే గమనార్హం. మరీ ముఖ్యంగా బలమైన నెట్ వర్క్,సమర్థులైన సాంకేతిక నిపుణులు పనిచేసిన భారీ చిత్రాల్లో గ్రాఫిక్స్ ప్రేక్షకులను ఏ మాత్రం ఆకట్టుకోలేక అప్రతిష్ట పాలవుతున్నాయి. ఇటీవల విడుదలైన విశ్వంభర టీజర్ గానీ, హరి హర వీరమల్లు, కన్నప్ప లాంటి సినిమాలే దీనికి నిదర్శనం. అదే సమయంలో చిన్న చిత్రాల్లోని గ్రాఫిక్స్ కళ్లప్పగించేలా చేస్తూ సినిమాని బ్లాక్ బస్టర్‌గా మారుస్తున్నాయి. అలాంటి సినిమాల జాబితాలో ఇప్పుడు మిరాయ్ కూడా జేరింది. విడుదలైన రోజు నుంచి మిరాయ్ బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లతో పాటు సమీక్షలు కూడా సాధిస్తోంది. ఈ చిత్రం బృందంలో సాంకేతికత పాత్ర భారీగా ప్రశంసలు అందుకుంటోంది. అత్యంత ఆశ్చర్యకరంగా, హాలీవుడ్‌లోని అంతర్జాతీయ విఎఫ్ఎక్స్ కంపెనీలతో సమానమైన అవుట్‌పుట్‌ను మిరాయ్ బృందం అందించగలిగింది. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఇదంతా హైదరాబాద్‌లోనే స్థానికంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నియమించిన టీమ్ ఈ అద్భుతమైన ఆవిష్కరణను అందించడం. ట్రైలర్ విడుదలైనప్పుడే వీక్షకులు అందరూ అవుట్‌పుట్‌కి ఆశ్చర్యపోయారు నేడు, సినిమా థియేటర్లలో ఇంటర్వెల్ ముందు పక్షి ఎపిసోడ్, ట్రైన్ ఎపిసోడ్, రాముడి సీన్లు...తెరపైన ఆవిష్కృతమవుతుంటే.. ప్రేక్షకులు ఆ అద్భుతమైన గ్రాఫిక్స్ పనితీరుని కళ్లప్పగించి చూస్తుండటం కనిపిస్తోంది. ఇటీవల అనేక భారీ బడ్జెట్ చిత్రాలు పరిశ్రమలలోని టాప్ కంపెనీల నుంచి కూడా నమ్మదగిన విఎఫ్ఎక్స్ అవుట్‌పుట్‌ను పొందడంలో తరచుగా విఫలమవుతున్న పరిస్థితిలో హైదరాబాద్‌లోని సాంకేతిక నిపుణులే దీనిని సాధించగలగడం మరింత ఆశ్చర్యానందాలను కలిగిస్తోంది. విఎఫ్ఎక్స్ వర్క్ లో ఎటువంటి అస్పష్టత రాకుండా కూడా చిత్రబృందం చాలా రకాల జాగ్రత్తలు తీసుకున్నారు, పరిమిత వనరులతోనే టీమ్ మిరాయ్ ఈ అద్భుతమైన అవుట్‌పుట్‌ను సాధించడం గమనార్హం. ఈ సినిమా సాధించిన అనూహ్య విజయం రాబోయే మరో అగ్రహీరో ప్రభాస్ భారీ చిత్రం రాజా సాబ్‌ను చర్చనీయాంశంగా మారుస్తోంది. ఎందుకంటే పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న రాజాసాబ్ కూడా మిరాయ్ ను అందించిన అదే ప్రొడక్షన్ హౌస్ నుంచి రానుంది. రెబల్ స్టార్ అభిమానులు ఈ చిత్రానికి కూడా అదే రకమైన అవుట్‌పుట్ ను ఊహిస్తున్నారు. దాంతో ఆ చిత్రంపై ఉన్న అంచనాలు మరింత పెరిగి ఒక్కసారిగా తారాస్థాయికి చేరుకున్నాయి. రాజా సాబ్ ఒక హర్రర్ డ్రామా, దీనిని చాలా వరకూ సెట్‌లోనే చిత్రీకరించారు దాంతో విఎఫ్ఎక్స్ వర్క్ చాలా అవసరమైంది.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108